FOR ADS......
ఆకాంక్ష
CONTACT:
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో
భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
ఆకాంక్ష

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :183 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ సోమవారం- 23 - ఫిబ్రవరి - 2026

## ఏపీలో భారత్‌నెట్ విస్తరణ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం



- ప్రాజెక్టు అమలుకు రూ. 2,432 కోట్లు విడుదల చేయనున్న కేంద్రం
- సుమారు 5 లక్షల గ్రామీణ గృహాలకు హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్లు
- రాష్ట్రవ్యాప్తంగా 13,426 గ్రామ పంచాయతీల్లో ప్రాజెక్టు అమలు
- ఏపీ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పనులు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సేవలను విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ముందడుగు వేశాయి. అమెండెడ్ భారత్‌నెట్ ప్రాజెక్ట్ ను రాష్ట్రంలో సమర్థంగా అమలు చేసేందుకు ఇరు ప్రభుత్వాల మధ్య ఒక ముఖ్యమైన సహకార ఒప్పందం (వీశీజ) కుదిరింది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. మిగతా..2లో

## జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు



- జూబ్లీహిల్స్‌లో అదుపుతప్పిన ఫెరారీ స్పోర్ట్స్ కారు
- అతివేగంతో ఇతర వాహనాలను ఢీకొట్టి బీభత్సం
- ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు, ఆస్పత్రికి తరలింపు
- రోడ్ నెం. 45లో భారీగా నిలిచిన ట్రాఫిక్
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలన్న పోలీసుల సూచన

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం ఓ ఫెరారీ స్పోర్ట్స్ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంతో ప్రయాణిస్తున్న ఈ కారు రోడ్ నెం. 45లో అదుపుతప్పి పక్క రోడ్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో పలు కార్లు, బైక్‌లను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటన సినీ నటుడు మిగతా..2లో

## ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం... మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు



- లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, మల్లారెడ్డి
- తెలంగాణ ఎస్ఐబీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టులు
- వీరితో పాటు 16 మంది లొంగుబాటు

ఢల్లి : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'లో కీలక పరిణామం చోటు చేసుకున్నది. మావోయిస్టు కీలక నేతలు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి భద్రతా బలగాలకు సరెండర్ అయ్యారు. దేవ్ జీ మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీగా ఉండగా,

## వచ్చే రెండు, మూడేళ్లలో

# ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం



- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పరిశీలన అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష
- గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని వ్యాఖ్య

హైదరాబాద్: గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పై ఆయన పలు విమర్శలు గుప్పించారు. మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారు, తీర్పు ఇచ్చారుని రేవంత్ రెడ్డి వివరించారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే నివాసంపై దాడి..

## తీవ్రంగా స్పందించిన బండి సంజయ్

- ప్రశ్నిస్తే దాడులు చేయడమేమిటని ప్రశ్న
- కాంగ్రెస్, మజ్లిస్ అరాచకాలను అడ్డుకోవడానికి సిద్ధం కావాలని పిలుపు
- కాంగ్రెస్ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటోందని ఆరోపణ



హైదరాబాద్: తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయని, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు కలిసి అరాచకాలు సృష్టిస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కామారెడ్డిలో కాటిపల్లి వెంకటరమణా రెడ్డి నివాసం వద్ద ఉద్రిక్తతలు, ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్టు తదితర అంశాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రౌడీ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ప్రశ్నిస్తే దాడులు చేయడమేమిటని కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల అరాచకాలను అడ్డుకోవడానికి మిగతా..2లో

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో భారీ ఫ్రాడ్

### ఏకంగా రూ.590 కోట్లు కొట్టేసిన ఉద్యోగులు!




- ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచీలో ఫ్రాడ్
- నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- పలు ఖాతాలకు అనధికారికంగా నగదు బదిలీ
- దాదాపు రూ.590 కోట్ల ఆర్థిక మోసం జరిగిందన్న బ్యాంక్

ఢిల్లి : ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం జరిగింది. చండీగఢ్ నగరంలోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు

## దేశంలోనే తొలి హైస్పీడ్ మెట్రోను

# ప్రారంభించిన ప్రధాని మోదీ

### కాంగ్రెస్ నీచ రాజకీయాలు చేస్తోందని విమర్శ

- మేరట్ పర్యటనలో ప్రధాని మోదీ- మెట్రో సర్వీసును ప్రారంభం
- గ్లోబల్ ఈవెంట్ ను కాంగ్రెస్ నీచ రాజకీయల కోసం ఉపయోగించిందని విమర్శ



ఢిల్లి : దిల్లీలో నిర్వహించిన ప్రపంచస్థాయి ఏఐ సదస్సును కాంగ్రెస్ పార్టీ మురికి, సిగ్గులేని రాజకీయాలకు వేదికగా మార్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. సదస్సులో కాంగ్రెస్ కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడంపై స్పందించిన మోదీ, దేశానికి ఆ పార్టీ నిజస్వరూపం తెలుసని, మళ్లీ బట్టలు విప్పాల్సిన అవసరం ఏంటని వ్యాఖ్యానించారు. ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్ లోని మేరత్ మెట్రో, నమో భారత్ కారిడార్‌ను ప్రారంభించారు. అలాగే రూ. 12,930 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.

## సాక్షాత్తు రేవంత్ రెడ్డే

# ఒప్పేసుకున్నాడు

తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలంతా తలో చెయ్యి వేసి ఒక వెయ్యి కోట్లు పోగు చేసి రాహుల్ గాంధీ కుటుంబానికి ఇచ్చే సామర్థ్యం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.



### భూ నిర్వాసితులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలంతా తలో చెయ్యి వేసి ఒక వెయ్యి కోట్లు పోగు చేసి రాహుల్ గాంధీ కుటుంబానికి ఇచ్చే సామర్థ్యం ఉందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా కీలక ట్వీట్ పెట్టారు. 'రెండేళ్లుగా తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎం లాగా మారింది అని మేమెన్నో సార్లు చెప్పిన విషయం ఇప్పుడు సాక్షాత్తూ రేవంత్ రెడ్డే నిస్సిగ్గుగా ఒప్పుకున్నాడు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు



- చంద్రబాబు, జగన్‌లు బీజేపీకి బానిసలుగా మారారని షర్మిల విమర్శ
- మోదీ చైనా రోబోను ప్రదర్శించినప్పుడు వీరి నోళ్లు పెగల్లేదని ఎద్దేవా
- చంద్రబాబుది అధికారిక పొత్తు కాగా, జగన్‌ది బీజేపీతో అక్రమ పొత్తు అని ఆరోపణ
- రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అంటూ కొత్త నిర్వచనం
- రైతుల కోసం కాంగ్రెస్ నిరసన చేస్తుంటే ఉగ్రకోణం అంటారా అని ఫైర్

## మావోయిస్టు ఉద్యమంలో

# మీసాల రాజిరెడ్డి ముగింపు ప్రస్థానం...

- ఉద్యమ భవిష్యత్తుపై కీలక ప్రభావం చూపనున్న అగ్రనేతల లొంగుబాటు...
- తెలంగాణలో నక్సలైట్ ఉద్యమ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది...
- మంథని విద్యార్థి దశ నుంచి పోలిట్ బ్యూరో వరకూ రాజిరెడ్డి సుదీర్ఘ విప్లవ ప్రస్థానం...
- కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ఆపరేషన్లతో బలహీనపడుతున్న మావోయిస్టు ఉద్యమం...








మంథని//ఫిబ్రవరి 22(ఆకాంక్ష ) : తెలంగాణలో మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కీలక స్థానాన్ని సంపాదించిన అగ్ర నాయకుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ సుదీర్ఘ విప్లవ ప్రయాణానికి మరో కీలక మలుపు తిరిగినట్టు సమాచారం అందుతోంది. మావోయిస్టు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడిగా దండకారణ్య పరిధిలో దశాబ్దాల పాటు కీలక బాధ్యతలు నిర్వర్తించిన రాజిరెడ్డి, తనతో పాటు మరికొంతమంది అగ్ర నాయకులతో కలిసి తెలంగాణలో లొంగుబాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.మంథని మండల పరిధిలోని ఏ-క్లాస్ పూర్ గ్రామ పంచాయతీ ఆమ్లెట్ గ్రామంలోని

## పవన్ కల్యాణ్ దత్తత గ్రామం

# కొణిదెలకు కొత్తదశ

### రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు




- 2019 ఎన్నికల సమయంలో గ్రామంలో పవన్ పర్యటన
- నాడు సమస్యలను విని పరిష్కరిస్తానని పవన్ హామీ
- రూ.50 లక్షలతో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం

## మొదటి పేజి తరువాయి

## పవన్ కల్యాణ్ దత్తత గ్రామం కొణిదెలకు కొత్తదశ

అమరావతి : ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామానికి మహర్దశ పట్టింది. పవన్ కల్యాణ్ ఇంటి పేరు, ఆ ఊరి పేరు "కొణిదెల" కావడం విశేషం. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో ఉండగా అక్కడ సమస్యలను స్థానికులు పవన్ దృష్టికి తెచ్చారు. తన ఇంటి పేరుతో ఉన్న కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని పవన్ వారికి హామీ ఇచ్చారు. 2025లో నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో కొణిదెల గ్రామాభివృద్ధికి రూ.50 లక్షల విరాళం అందించారు. జిల్లా యంత్రాంగం సూచన మేరకు ఆ నిధులతో 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ నీటి ట్యాంకు నిర్మించారు. దీంతో పాటు పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి, గోకులాలు, ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. కేవలం ప్రభుత్వ పథకాల నుంచే ఇప్పటివరకు సుమారు రూ.6 కోట్లకు పైగా నిధులు కొణిదెల గ్రామాభివృద్ధికి వెచ్చించారు. గ్రామానికి అవసరం ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.50 లక్షలతో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. దీని వల్ల ఆ గ్రామ పరిధిలో 2 వేల మంది దాహార్తి తీరనుంది. వేసవికి ముందే ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులను అభినందించారు.

## వచ్చే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం

పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. పదేళ్ల అనుభవంతో వాళ్లు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధమని వ్యాఖ్యానించారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం ప్రజలు, నీళ్ల విషయంలో కాదని హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బీఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పనట్లుగా వారు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని ఆయన తెలిపారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు. వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా ప్రాజెక్టులకు, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ.6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ఇవాళ రూ.18 వేలకోట్ల అవసరమైన స్థితికి చేరుకుందన్నారు. అన్ని ప్రాజెక్టులపై సమీక్ష చేసి పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నారు. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం : సీఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని వివరించారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

## కామారెడ్డి ఎమ్మెల్యే నివాసంపై దాడి..
## తీవ్రంగా స్పందించిన బండి సంజయ్

సిద్ధం కావాలని బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన సంఘటనలు ప్రతి ఒక్కరు గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నామని కాంగ్రెస్ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఇంటిపైనే దాడులు చేయడం అమానుషమని అన్నారు. ఇక సామాన్య ప్రజలకు భద్రత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆత్మరక్షణ కోసం అడ్డుకుంటే దాడి చేశారని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. బాన్సువాడలో 70 మందిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. బాన్సువాడలో రాళ్లదాడి చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. మజ్లిస్ పార్టీని కాపాడటానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## జూబ్లీహిల్స్‌లో బీభత్సం సృష్టించిన స్పోర్ట్స్ కారు

నందమూరి బాలకృష్ణ నివాసానికి సమీపంలో చోటుచేసుకుంది. ప్రమాదం ధాటికి వాహనాలు నుజ్జునుజ్జవగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం. 45లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు.రోడ్ నెం. 45 నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం. 45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం...
## మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు

రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

## సాక్షాత్తు రేవంత్ రెడ్డే ఒప్పేసుకున్నాడు

రైతన్నలకు, మహిళలకు, యువతకు, అవ్వాతాతలకు ఉద్యోగస్తులకు, రిటైర్డ్ ఉద్యోగస్తులకు ఇచ్చిన 420 హామీల అమలుకేమో రూపాయి లేదంటాడు. మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను, లగచర్లలో గిరిజనుల భూమిని, హెచ్‌సీయూ విశ్వవిద్యాలయ భూమిని, హిల్ట్ పాలసీ పేరిట పరిశ్రమల భూమిని, అనుముల బ్రదర్స్ కలిసి ఆంబుక్క పడుతున్నారు. రెండేళ్లలోనే మూడు లక్షల కోట్ల అప్పు తెచ్చి రాష్ట్రంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదీ సర్కారు. చేస్తున్నదల్లా దండుపాళ్యం ముఠాలాగా తెలంగాణను దోచుకోవడం, స్వంతానికి దాచుకోవడం. పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి సంచులు మోయడం' అని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ప్రపంచంపై మళ్లీ పిడుగు



న్యూయార్క్, వాషింగ్టన్: సుంకాల విషయంలో సుప్రీం కోర్టు షాకిచ్చినా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెనక్కి తగ్గడం లేదు. ప్రపంచ దేశాలపై శుక్రవారం 10 శాతం సుంకాలను విధించిన ఆయన.. వాటిని 15 శాతానికి పెంచుతానని శనివారం ప్రకటించారు. భారత్‌కూ 15 శాతమే వర్తిస్తాయని స్పష్టం చేశారు. వాస్తవానికి సుప్రీం తీర్పు తర్వాత తనకున్న అధికారాలతో అన్ని దేశాలపై 10 శాతం సుంకాలను విధిస్తున్నట్లు శుక్రవారం ఆయన అధికారికంగా ప్రకటించి.. ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ నెల 24వ తేదీ నుంచి అవి అమల్లోకి వస్తాయని వెల్లడించారు. ఒక రోజు తిరిగేసరికల్లా 10 శాతం కాదు.. 15 శాతం విధిస్తామని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా ఆయన ప్రకటించారు. 'చట్టానికి నిలిచే విధంగానే 10 శాతం నుంచి 15 శాతానికి సుంకాలను పెంచుతాం. అమెరికాకు వ్యతిరేకంగా హాస్యాస్పదంగా, పేలవంగా రాసిన అసాధారణ కోర్టు తీర్పును సమగ్రంగా, వివరంగా పూర్తిగా సమీక్షించాకే సుంకాల పెంపుపై నిర్ణయానికి వచ్చాం' అని ట్రంప్ ప్రకటించారు. 'అమెరికా అధ్యక్షుడు చెప్పాలనుకున్న విషయాన్ని చెప్పడానికి అవకాశమివ్వండి. ప్రపంచ దేశాలపై విధించిన 10 శాతం సుంకాలను 15 శాతానికి పెంచుతాం. ప్రతీకార సుంకాల్లేకుండా ఎన్నో దశాబ్దాలుగా అమెరికాను దోచుకుంటున్న ఆయా దేశాలు ఇందులో ఉన్నాయి. చట్టానికి నిలిచేలా 15 శాతం స్థాయికి సుంకాలను తీసుకెళ్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. రానున్న కొద్ది నెలల్లోనే మరిన్ని సుంకాలను విధిస్తామని ప్రకటించారు. సుప్రీం తీర్పు తర్వాతా ఏమీ మారలేదని, భారతే తమకు సుంకాలను చెల్లిస్తుందని, తాము ఎటువంటి సుంకాలను ఆ దేశానికి చెల్లించబోమని ట్రంప్ స్పష్టం చేశారు. తొలుత 10 శాతం సుంకాలపై శ్వేత సౌధం విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌లో.. అమెరికా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచే, భవిష్యత్తులో మరింత పకడ్బందీగా సుంకాలు విధించే అవకాశమున్న కొన్ని వస్తువులకు ఈ తాత్కాలిక సుంకాలు వర్తించబోవని పేర్కొంది. సుంకాలను విధిస్తానని హెచ్చరించి భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని మరోసారి ట్రంప్ పేర్కొన్నారు. ప్రధాని మోదీతో తనకు గొప్ప సంబంధాలున్నాయని తెలిపారు. 'ఏమీ మారదు. భారత్ సుంకాలను చెల్లిస్తుంది. మేం చెల్లించం. భారత్ చేసుకున్న ఒప్పందమే అలాంటిది. ప్రధాని మోదీ గొప్ప జెంటిల్‌మన్. అమెరికా విషయంలో నేను వ్యతిరేకించే వారి కంటే ఆయన తెలివైనవారు. ఆయన మమ్మల్ని చీల్చి చెండాడుతున్నారు. దీంతో మేం ఒప్పందం చేసుకున్నాం. ఇది పారదర్శక ఒప్పందం. కానీ వారే సుంకాలు చెల్లించేలా ఒప్పందాన్ని కాస్త తిప్పాం. భారత్‌తో నా సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. మా విజ్ఞప్తితో రష్యా నుంచి చమురును ఆ దేశం నిలిపేస్తోంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# దేశంలోనే తొలి హైస్పీడ్ మెట్రోను ప్రారంభించిన ప్రధాని మోదీ

### మొదటి పేజి తరువాయి

అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్ నాయకులు మోదీని ద్వేషిస్తారు. వారు నా నా సమాధిని తవ్వాలని చూస్తున్నారు. నా తల్లిని అవమానించడానికి కూడా వెనుకాకడరు. ఏఐ గ్లోబల్ సమ్మిట్ బీజేపీ కార్యక్రమం కాదు. ఆ సమ్మిట్‌కు ఏ బీజేపీ నాయకుడు హాజరు కాలేదని కాంగ్రెస్ గుర్తుంచుకోవాలి. ఇది దేశం గర్వించే పని. కానీ కాంగ్రెస్ జాతీయ గౌరవాన్ని ఉల్లంఘించింది. కాంగ్రెస్ ఈ అవినీతి విధానాన్ని దేశం మొత్తం ఖండిస్తోంది. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పుడు భారత్ తో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకున్నప్పటికీ, అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు చేసుకోలేకపోయాయి. ఎందుకంటే అప్పట్లో, స్కామ్‌లకు పేరుగాంచిన కాంగ్రెస్ ప్రభుత్వంతో వ్యవహరించడానికి ప్రపంచం సంకోచించింది. కానీ నేడు, అభివృద్ధి చెందిన దేశాలు భారత్ తో వాణిజ్యం చేసేందుకు ఆసక్తిగా ఉన్నాయి. ఇప్పుడు 21వ శతాబ్దపు సవాళ్లకు పరిష్కారాలను అందించగల శక్తి భారత్ అని ప్రపంచం భావిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు.



#### కుంభకోణాల వల్లే అభివృద్ధి జరగలేదు : మోదీ

కాంగ్రెస్- సమాజ్‌వాదీ పాలనలో మౌళికసదుపాయాల కుంభకోణాల వల్ల అభివృద్ధి కుంటుపడిందని ప్రధాని మోదీ వివరించారు. మెట్రో సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాన్ని చాలా వరకు దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో మెట్రో సేవలు 5 నగరాలకే పరిమితమై ఉండేవని, ఇప్పుడు అవి 25 నగరాలకు పైగా విస్తరించాయని వివరించారు. బీజేపీ వచ్చాక శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, స్థానికులు సహా పెట్టుబడిదారుల్లో అవి విశ్వాసాన్ని నింపాయన్నారు. కుంభకోణాలను ఆపడమే కాకుండా దేశాన్ని స్వావలంబన మార్గంలో ముందుకు తీసుకెళ్లామని చెప్పారు.

ప్రజలకు సౌకర్యవంతమైన సదుపాయాలను అందించడమే లక్ష్యంతోనే గత 11 సంవత్సరాలుగా బీజేపీ పని చేసిందని ప్రధాని మోదీ అన్నారు. అందుకే మెట్రోల సేవలు డజన్ల కొద్దీ నగారలను చేరుకున్నాయని అన్నారు. ఇప్పుడు ప్రపంచంలోనే భారత్ మూడో అతిపెద్ద మెట్రోట్రైన్ నెట్వర్క్‌ను కలిగి ఉందని ప్రధాని మోదీ అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి ఈ మేరఠ్ మెట్రో, నమో భారత్ రైళ్లను ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించారు. దేశంలో తొలిసారి 120కిలోమీటర్ల వేగంతో ప్రారంభమైన మెట్రో సర్వీసు ఇది. హైస్పీడ్ ఇంటర్‌సిటీ ప్రయాణం ఉద్యమానికి ఈ చర్య కీలక ముందడుగు కానుంది. ఈ సందర్భంగా 82 కిలోమీటర్ల ఢిల్లీ మీరట్ నమో భారత్ కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. భారత్‌లోని తొలి నమో భారత్ ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ సెక్షన్‌లను ప్రారంభించారు. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో నమో భారత్ భారత తొలి ప్రాంతీయ రాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ. అలాగే రూ.12,930 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైళ్లను ప్రారంభించిన తర్వాత ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మోదీ మేరఠ్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో పర్యటించారు. మెట్రోలో ఉన్న విద్యార్థులు, అధికారులతో ప్రధాని ముచ్చటించారు.

# ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో భారీ ఫ్రాడ్ - ఏకంగా రూ.590 కోట్లు కొట్టేసిన ఉద్యోగులు!

### మొదటి పేజి తరువాయి

చెందిన ఒక బ్రాంచీలో జరిగిన ఈ గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్ల దాకా ఉందని తెలిసింది. ఈ బ్రాంచీకి చెందిన కొంతమంది ఉద్యోగులే ఈ మోసానికి పాల్పడ్డారని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు వెల్లడించింది. ఈ సమాచారాన్ని ఫిబ్రవరి 21న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు తెలియజేసింది. దీనిపై పోలీసులకూ ఫిర్యాదు చేశామని తెలిపింది. తమ బ్యాంకులో ఉన్న హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతా, కొందరు వ్యక్తులు, సంస్థల ఖాతాలలో మోసపూరిత, అనధికారిక లావాదేవీలు జరిగాయనే ప్రాథమిక సమాచారం ఉందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం ఈ అన్ని ఖాతాల లావాదేవీలపై అంతర్గత సమీక్ష చేస్తున్నామని, అది పూర్తయ్యాక ఎంత మొత్తంలో ఆర్థిక మోసం జరిగింది అనేది నిర్దిష్టంగా తేలుతుందని చెప్పింది. ఖాతాల్లోని లావాదేవీల సమాచారం, ఖాతాదారులు చేసే క్లెయిమ్‌లు, రికవరీ అయ్యే నగదును కలుపుకొని ఈ ఆర్థిక మోసం విలువను నిర్ధారిస్తామని బ్యాంకు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి ఈ ఆర్థిక మోసం విలువ రూ.590 కోట్ల దాకా ఉంటుందనే అంచనాకు వచ్చినట్లు ఆర్‌బీఐకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తెలియజేసింది.

#### మోసం ఇలా వెలుగులోకి వచ్చింది!

హరియాణా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఓ శాఖ/విభాగానికి తమ బ్యాంకులో గత కొన్నేళ్లుగా ఖాతా ఉందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తెలిపింది. అయితే ఆ ఖాతాను మూసివేసి, బ్యాలెన్స్‌ను మరొక బ్యాంకుకు బదిలీ చేయమని హరియాణా రాష్ట్ర ప్రభుత్వ విభాగం ఫిబ్రవరి 18న చండీగఢ్‌లోని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు బ్రాంచ్ ని కోరింది. ఈక్రమంలో హరియాణా రాష్ట్ర ప్రభుత్వ విభాగం ఖాతాలోని




లావాదేవీలను తనిఖీ చేయగా ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించామని ఆర్‌బీఐకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు తెలియజేసింది. హరియాణా ప్రభుత్వ ఖాతాలో ఉండాల్సిన దాని కంటే తక్కువ అమౌంట్ ఉండటంతో వ్యవహారం వెలుగు చూసిందని చెప్పింది. ఈ అక్రమ, అనధికారిక, మోసపూరిత లావాదేవీల్లో ఆ బ్రాంచీలోని కొందరు ఉద్యోగుల పాత్ర ఉందని గుర్తించామని తెలిపింది. ఈ బ్రాంచీలో ఖాతాలను కలిగిన ఇతర ఖాతాదారులపై, ఈ మోసం వల్ల ఎలాంటి ప్రభావమూ పడలేదని బ్యాంకు స్పష్టం చేసింది. హరియాణా రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాతో ముడిపడిన వ్యక్తులు, సంస్థల ఖాతాలపైనే ఫ్రాడ్ ప్రభావం పడిందని తేల్చి చెప్పింది. పలు అనుమానిత ఖాతాల్లోకి కొందరు ఉద్యోగులు మోసపూరితంగా నగదును బదిలీ చేశారని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు పేర్కొంది. అనుమానిత ఖాతాలను గుర్తించామని, నిధుల రికవరీ కోసం ఆయా ఖాతాలున్న బ్యాంకులకు రీకాల్ రిక్వెస్టులను పంపించామని వెల్లడించింది.

#### స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్ చేయిస్తాం!

ఫిబ్రవరి 18న ఈ ఆర్థిక అవకతవకల వ్యవహారం వెలుగుచూడగా, పూర్తి సమాచారాన్ని ఫిబ్రవరి 20న ఆర్‌బీఐకు చెందిన స్పెషల్ కమిటీ ఆఫ్ ది బోర్డ్ ఫర్ మానిటరింగ్‌కు అందజేశామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు చెప్పింది. మరుసటి రోజే (ఫిబ్రవరి 21న) ఆర్‌బీఐ నియంత్రణలోని ఆడిట్ కమిటీ ఆఫ్ ది బోర్డ్‌కు, బ్యాంకుకు చెందిన డైరెక్టర్ల బోర్డుకు దీనిపై నివేదికను అందజేశామని వెల్లడించింది. స్వతంత్ర ఆడిటర్లకూ దీనిపై సమాచారాన్ని అందజేశామని బ్యాంకు తెలిపింది. స్వతంత్ర బహిరంగ ఏజెన్సీని నియమించి ఈ మోసంపై స్వతంత్ర ఫోరెన్సిక్ ఆడిట్‌ను చేయిస్తామని ఆర్‌బీఐకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు సమాచారాన్ని అందించింది. దీనిపై ఇప్పటికే ప్రాథమిక అంతర్గత సమీక్షను నిర్వహించామని చెప్పింది.

#### నలుగురు బ్యాంకు అధికారులపై సస్పెన్షన్ వేటు

చండీగఢ్‌లో ఈ మోసం జరిగిన బ్రాంచీలోని నలుగురు అధికారులను సస్పెండ్ చేశామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు చెప్పింది. ప్రస్తుతం వారిపై దర్యాప్తు జరుగుతోందని పేర్కొంది. ఈ వ్యవహారంలో భాగమైన ఉద్యోగులతో పాటు బయటివారిని గుర్తించి కఠినమైన క్రిమినల్, సివిల్, క్రమశిక్షణా చర్యలను తీసుకుంటామని బ్యాంకు వెల్లడించింది.

రూ.503 కోట్ల నికర లాభం : 24 శాతం పెరిగిన డిపాజిట్లు

గత శుక్రవారం రోజు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకు షేరు ధర 0.72 శాతం మేర పెరిగి రూ.83.56కు చేరింది. 2025 అక్టోబరు - డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో ఈ బ్యాంకు ఆశాజనక ఫలితాలను సాధించింది. ఆ మూడు నెలల కాలంలో బ్యాంకు డిపాజిట్లు 24 శాతం మేర పెరిగాయి. కరెంట్ ఖాతాలు, పొదుపు ఖాతాలలో డిపాజిట్లు 33 శాతం మేర పెరగడంతో ఈ పురోగతి సాధ్యమైంది. బ్యాంకు నికర లాభం సైతం 48 శాతం పెరిగి రూ.503 కోట్లకు చేరింది.

# మావోయిస్టు ఉద్యమంలో మీసాల రాజిరెడ్డి ముగింపు ప్రస్థానం...

### మొదటి పేజి తరువాయి

శాస్త్రుల్లపల్లెకు చెందిన రాజిరెడ్డి విద్యార్థి దశ నుంచే విప్లవ సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యారు. మంథనిలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన పీపుల్స్ వార్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై, అప్పటి నుంచి నక్సలైట్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.ఆ ప్రాంతంలో "మీసాల రాజిరెడ్డి"గా ప్రసిద్ధి పొందిన ఆయన, స్థానికంగా ఉద్యమం బలపడుతున్న దశలోనే భూగర్భ జీవితం ఎంచుకున్నారు.కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో పీపుల్స్ వార్ పార్టీలో చేరిన రాజిరెడ్డి, అంచెలంచెలుగా ఎదిగి పార్టీ కేంద్ర కమిటీలో కీలక స్థానం సంపాదించారు. అనంతరం దండకారణ్య పరిధిలో గెరిల్లా దళాల నిర్వహణ, వ్యూహ రచన, కేడర్ విస్తరణలో ప్రధాన పాత్ర పోషించారు. పలు దశాబ్దాల పాటు ఆయన పార్టీ పోలిట్ బ్యూరో సభ్యునిగా సేవలు అందిస్తూ, ఆ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు నాయకత్వం వహించారు.రాజిరెడ్డి ఉద్యమ జీవితం అరెస్టులు, జైలు జీవితం, అజ్ఞాతం వంటి దశలతో నిండి ఉంది. 2007లో కేరళలో ఒకసారి, 2018లో మరోసారి అరెస్టయ్యారు. 2018లో అరెస్టైన తర్వాత మంథని కోర్టులో హాజరై, అనంతరం బెయిల్‌పై విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఆ సమయంలో ఆయన కుటుంబ సభ్యులుతల్లి, తమ్ముడు, కూతురులొంగిపోవాలని కోరినా, ఉద్యమం పట్ల నిబద్ధతతో ఆయన తిరిగి అడవుల్లోకి వెళ్లినట్టు అప్పటి వర్గాలు వెల్లడించాయి.కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి 31 నాటికి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ప్రత్యేక ఆపరేషన్లు ఉద్యమంపై గట్టి ప్రభావం చూపుతున్నాయి. "ఆపరేషన్ కగార్", "కర్రె గుట్టలు" వంటి ప్రత్యేక దళాల చర్యలు



దండకారణ్య అటవీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టు అగ్రనేతలైన నంబాల కేశవరావు వంటి కీలక నాయకులు ఎదురుకాల్పుల్లో మరణించగా, మరి కొంతమంది అగ్ర నాయకులు ఇప్పటికే లొంగిపోయారు.ఇటీవల కాలంలో నిరంతర కూంబింగ్ ఆపరేషన్లు, ఆధునిక సాంకేతిక పర్యవేక్షణ, ఆర్థిక వనరుల కొరత, స్థానిక మద్దతు తగ్గుదల వంటి కారణాలు మావోయిస్టు ఉద్యమాన్ని బలహీనపరిచినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అడవులను జల్లెడ పడుతున్న కేంద్ర బలగాలు గెరిల్లా కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో సాయుధ పోరాటాన్ని కొనసాగించడం సాధ్యం కాదనే భావన అగ్ర నాయకత్వంలో పెరుగుతున్నట్టు సమాచారం.ఈ నేపథ్యంలో రాజిరెడ్డి, దేవ్ జి తదితర అగ్ర నాయకులు లొంగుబాటు వైపు మొగ్గు చూపినట్టు తెలుస్తోంది. ఇప్పటికే వేణుగోపాల్, ఆశన్న వంటి నాయకులు లొంగిపోవడం ఉద్యమానికి పెద్ద దెబ్బగా భావించబడుతోంది. ఈ పరిణామాలు ఉద్యమ శ్రేణుల్లో ఆత్మపరిశీలనకు దారితీసినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.రాజిరెడ్డి సహా మరో పాతికమంది కీలక మావోయిస్టు నాయకులు వచ్చే రెండు రోజుల్లో తెలంగాణకు చెందిన ఓ కీలక నాయకుడి సమక్షంలో లొంగిపోవచ్చని విశ్వసనీయ సమాచారం అందుతోంది. ఇందుకు సంబంధించి స్పెషల్ బ్రాంచ్ ఇంటెలిజెన్స్ అధికారులు, పోలీస్ ప్రత్యేక బృందాలు మధ్యవర్తులతో చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఈ చర్చల్లో తెలంగాణలోని ఓ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌తో పాటు కొంతమంది పౌర హక్కుల నాయకులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.మల్లా రాజిరెడ్డి లొంగుబాటు మావోయిస్టు ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచే అవకాశముంది. దశాబ్దాల పాటు గెరిల్లా పోరాటానికి నాయకత్వం వహించిన అగ్రనేత లొంగిపోవడం ఉద్యమ భవిష్యత్తుపై గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. తెలంగాణలో నక్సలైట్ ఉద్యమానికి పునాది వేసిన ప్రాంతమైన మంథని నుంచి వచ్చిన నాయకుడే చివరకు లొంగుబాటు దిశగా అడుగులు వేయడం ఉద్యమంలో ఒక యుగాంతానికి సంకేతంగా భావిస్తున్నారు. మావోయిజం నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు, భద్రతా దళాల వ్యూహాలు, ఆధునిక సాంకేతిక వినియోగం, సామాజిక-ఆర్థిక మార్పులు అన్నీ కలిపి ఉద్యమాన్ని క్రమంగా బలహీనపరుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అగ్రనేతల లొంగుబాట్లు మరింత పెరిగే అవకాశముందని భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తంగా చూస్తే, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ జీవిత ప్రయాణం తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన ఒక దీర్ఘ గాథ.ఇప్పుడు ఆయన లొంగుబాటు దిశగా అడుగులు వేయడం ఉద్యమ చరిత్రలో ఒక కీలక మలుపుగా మారే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

### మొదటి పేజి తరువాయి

అమరావతి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు. ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది. ఈ వాస్తవాన్ని చంద్రబాబు, జగన్ అర్థం చేసుకోకపోవడం వారి అవివేకం" అని షర్మిల పేర్కొన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు మద్దతు



పెరుగుతుండటం చూసి ఓర్వలేకే బీజేపీ తమ నిరసనకు ఉగ్రవాద కోణాన్ని అంటగడుతోందని, ఇది కేంద్ర ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ఆమె మండిపడ్డారు. మోదీ కాషాయ కామెర్లు సోకిన వారు ఇలా కాకుండా ఎలా మాట్లాడతారని ఆమె వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

# ఏపీలో భారత్‌నెట్ విస్తరణ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

### మొదటి పేజి తరువాయి

ఈ ప్రాజెక్టు కింద రాష్ట్రానికి రూ. 2,432 కోట్ల నిధులను కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సుమారు 5 లక్షల కుటుంబాలకు ఫైబర్ కనెక్షన్ల ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలను అందించడం. దీని అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఏపీబీఐఎల్) పేరుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను డిజిటల్ భారత్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కేంద్రం తరఫున డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఐ అండ్ ఐ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం



13,426 గ్రామ పంచాయతీల్లో నెట్‌వర్క్‌ను విస్తరించనున్నారు. ఇందులో భాగంగా, ఇప్పటికే ఫేజ్- కింద ఉన్న 1,692 పంచాయతీల్లోని నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తారు. అలాగే, ఫేజ్- కింద 11,254 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులను పూర్తి చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 480 గ్రామ పంచాయతీలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించనున్నారు. వీటికి అదనంగా, స్థానిక అవసరాలు, డిమాండ్‌ను బట్టి 3,942 గ్రామాల్లో లాస్ట్ మైల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ప్రాజెక్టు సజావుగా సాగేందుకు అవసరమైన రైట్ ఆఫ్ వే అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. గ్రామాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి రావడం ద్వారా డిజిటల్ గవర్నెన్స్, ఆన్‌లైన్ విద్య, టెలిమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈ-గవర్నెన్స్ సేవలు మరింత పటిష్టంగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఒప్పందం గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విప్లవానికి బాటలు వేస్తుందని, సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## మృగ్యమైన మావలంకర్ వారసత్వం

'లోక్‌సభ తొలి స్పీకర్ జీవీ మావలంకర్, రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్, రాజ్యసభ తొలి చైర్మన్, ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంస్థల పనితీరుపై గొప్ప ప్రభావాన్ని చూపారు. నిబంధనలు, విధానాలు, సంప్రదాయాలు, పద్ధతులను రూపొందించడంలో వారు హుందాగా, నిష్పాక్షికంగా వ్యవహరించేవారు. రాజ్యసభలో జనసంఘ్ కు ప్రాతినిధ్యం ఉండకపోయినా నేను అతిథుల గ్యాలరీల నుంచి అక్కడి చర్చలను తిలకించేవాడిని. ప్రశ్నోత్తరాల సమయం, వాయిదా తీర్మానాలు, బిల్లులు, తీర్మానాలు, స్థాయీ సంఘాలు, సావధాన నోటీసులు, సభ్యుల హక్కులు మొదలైన వాటన్నింటి గురించి నేర్చుకునే అవకాశం నాకు వారి వల్లే లభించింది. ప్రతిపక్ష బెంచీల్లో కూర్చున్న హేమాహేమీలు కూడా అధికార పక్షం వైపు కూర్చున్న సభ్యులతో సమానంగా అనర్గళంగా మాట్లాడేవారు. ప్రతిపక్షాల హక్కులకు సంరక్షకుడుగా స్పీకర్ నిజాయితీతో వ్యవహరించేవారు. ఈ ఉత్తమ సంప్రదాయాల వల్లే భారత దేశ ప్రజాస్వామ్యం పరీక్షలకు తట్టుకుని నిలబడింది. అంతర్జాతీయంగా తన ప్రతిష్ఠను నిలబెట్టుకుంది' ఈ మాటలు ఎవరివో కాదు, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన లాల్‌కృష్ణ ఆడ్వాణీవి. తన ఆత్మకథ ' నా దేశం నా జీవితం' లో ఒకప్పటి పార్లమెంటరీ ప్రమాణాల గురించి ఆడ్వాణీ వివరంగా రాశారు. ఏ ప్రమాణాలైనా వ్యక్తులు నిలబెడితేనే సుస్థిరంగా ఉంటాయి. వ్యక్తులు తమ ప్రయోజనాలకోసం ప్రమాణాలను పణంగా పెడితే ఉదాహరణగా చెప్పుకోవడానికి ఏ ప్రమాణాలూ నిలువవు. సమాజంలో దిగజారుతున్న విలువలు పార్లమెంటరీ చర్చలను ప్రభావితం చేస్తే మన ప్రజాస్వామ్య పతనం ఎలా ఉంటుందో చెప్పేందుకు నేడు చట్టసభలు సాగుతున్న తీరే నిదర్శనం. 'మీరు మాకు మార్గనిర్దేశనం చేయండి, మేము దారి తప్పితే అవసరమైతే మాకు బుద్ధి చెప్పండి. మా ప్రవర్తనను సరిదిద్దండి' అని తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ లోక్‌సభ తొలి స్పీకర్ గణేశ్ వాసుదేవ్ మావలంకర్ ను అభ్యర్థించారు. ఎప్పుడైనా తీవ్ర విభేదాలు నెలకొన్నప్పుడు ప్రధానమంత్రి, స్పీకర్, కార్యదర్శి కలసికట్టుగా సంప్రదించుకుని సమస్యను పరిష్కరించేవారు. ఒక రోజు సభలోనే మావలంకర్, నెహ్రూ మధ్య వాగ్వివాదం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా ఒకే రోజు రెండోసారి ప్రకటన చేయాలని నెహ్రూ సంకల్పించారు. అయితే అలా మాట్లాడడం నిబంధనల ప్రకారం కుదరదని మావలంకర్ స్పష్టం చేశారు. నెహ్రూ సరేనంటూ వెనక్కు తగ్గారు. ఆర్డినెన్స్ లను మావలంకర్ తీవ్రంగా వ్యతిరేకించేవారు. అరుదైన పరిస్థితుల్లో మినహా ఆర్డినెన్సులు జారీ చేయవద్దని స్పష్టంగా చెప్పేవారు. ఈ విషయమై ప్రధానికి లేఖ రాసేవారు. న్యాయపరమైన సందేహం వస్తే స్వయంగా అటార్నీ జనరల్ ను సంప్రదించేవారు. స్పీకర్ న్యాయమూర్తిగా వ్యవహరించాలని మావలంకర్ చెప్పేవారు. నెహ్రూ కూడా మావలంకర్ కు సమున్నత గౌరవం ఇచ్చేవారు. పార్లమెంటరీ కమిటీల్లో తమ నిర్ణయాలను శల్యపరీక్ష చేస్తున్నారని అధికారులు నెహ్రూకు ఫిర్యాదు చేసినప్పుడు దాని గురించి మాట్లాడడం తన పరిధిలో లేదని, స్పీకర్ నే సంప్రదించమని సలహా ఇచ్చేవారు. అనేక విషయాలకు సంబంధించి మావలంకర్ రూపొందించిన నియమ నిబంధనలే ఇప్పటికీ ఉన్నాయి. ' పాలక, ప్రతిపక్షాల మధ్య సరైన సమతుల్యత ఉండేలా చేస్తూ, సభను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రజల ప్రయోజనాలను కాపాడిన సభాపతి జీవీ మావలంకర్ 'అని లోక్ సభ తొలి సెక్రటరీ జనరల్ ఎమ్ఎన్ కౌల్ అన్నారు. పార్లమెంటు ప్రభుత్వ అధికారాలకు లోబడి ఉండకూడదని స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాలని నిర్ణయించిన మావలంకర్ గుజరాత్ నుంచి ఎన్నికైన సభ్యుడు కావడం గమనార్హం. మావలంకర్ మరణం తర్వాత స్పీకర్ అయిన అనంతశయనం అయ్యంగార్ కూడా అదే దారిలో నడిచారు. తిరుపతి సమీపంలోని తిరుచానూర్ లో వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అయ్యంగార్ లోక్ సభను నిష్పాక్షికంగా నడిపించేవారు. 'ఒక నియంత పాలనలో గానీ లేదా సంపూర్ణ రాచరిక పాలనలో గానీ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు ఎలాంటి రక్షణ ఉండదు. నియంత మంచివాడైతేనే ప్రజలు క్షేమంగా ఉంటారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో పాలకులు తమ వర్గాలకే అనుకూలంగా వ్యవహరిస్తూ చట్ట సభలో తక్కువ సంఖ్యలో ఉన్న వారిని అణిచివేసే ప్రమాదం ఉంది. ఈ ధోరణులను కఠినంగా నియంత్రిస్తూ తక్కువ సంఖ్యలో ఉన్న సభ్యుల ప్రయోజనాలను కాపాడగలిగిన వ్యక్తి సభాధ్యక్షుడు (స్పీకర్) మాత్రమే' అని అయ్యంగార్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు. ఇంగ్లీషులో హిరేన్ ముఖర్జీ (సీపీఐ), హిందీలో అటల్ బిహారీ వాజపేయి( జనసంఘ్)ను మించిన వక్తలు లేరని ఆయన కొనియాడేవారు. సరైన సంఖ్యాబలం లేనందువల్ల ప్రతిపక్ష నాయకుడంటూ లేకపోయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులందరికీ అయ్యంగార్ ఎంతో గౌరవం ఇచ్చి వారు మాట్లాడేందుకు వీలు కల్పించేవారు. రెండవ లోక్ సభలో అధికార ప్రతిపక్ష సభ్యులందరూ ఏకగ్రీవంగా అయ్యంగారే మళ్లీ స్పీకర్ కావాలని ప్రతిపాదించారంటే ఆయన సంపాదించిన గౌరవం, నిలబెట్టిన ప్రమాణాలే కారణం. 1972లో తిరుపతి నుంచి ఒక దళిత క్రైస్తవ ఎమ్మెల్యేను నిలబెట్టినప్పుడు ఆయనను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన మేరకు అనంతశయనం అయ్యంగార్ రంగంలోకి దిగారు. 'విశిష్టాద్వైతంలోనే లౌకిక వాదం జీర్ణించుకుపోయింది' అంటూ ఆయన తనను ప్రశ్నించిన తన వర్గీయులకు జవాబు చెప్పి ఆ ఎమ్మెల్యేను గెలిపించారు. అయ్యంగార్ తర్వాత స్పీకర్ అయిన సర్దార్ హుకం సింగ్ తొలి సారి నెహ్రూ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాలను ఆమోదించారు. ప్రభుత్వం కంటే పార్లమెంట్ ఆధిక్యతే ఎక్కువ అని ప్రకటించారు.

## ప్రమాణాలు పాటిస్తేనే లాభం!

మిత్రులు, ప్రత్యర్థులనే తేడా లేకుండా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందరి మీదా సుంకాల కొరడాను ఝుళిపించడం భారత్, ఐరోపా సమాఖ్య(ఈయూ)లను దగ్గర చేసింది. ఇరుపక్షాల నడుమ రెండు దశాబ్దాలుగా నలుగుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)పై సంతకాలు పూర్తయ్యాయి. అయితే, ఈ ఒప్పందం వల్ల భారత్, ఈయూలకు ఎలాంటి ప్రయోజనాలు ఒనగూడతాయి? మన సేద్య రంగంపై ఎలాంటి ప్రభావం ఉండనుంది? భారత్, ఐరోపా సమాఖ్యలు కలిసి సుమారు 200 కోట్ల జనాభా, ప్రపంచ జీడీపీలో 25శాతం వాటాతో సువిశాల విపణిగా నిలుస్తున్నాయి. ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ)తో రెండు పక్షాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, నవీకరణలు ఊపందుకుంటాయి. 99శాతం భారతీయ ఎగుమతులు, 97శాతం ఈయూ ఎగుమతులపై సుంకాలు తగ్గుతాయి. 2024-25లో ఇండియా-ఈయూ మధ్య సరకుల వాణిజ్యం విలువ 13,650 కోట్ల డాలర్లు(రూ.11.3లక్షల కోట్లు). అందులో భారత్ నుంచి ఈయూకు ఎగుమతైన వాటి విలువ 7,590 కోట్ల డాలర్లు. నిజానికి భారత్, ఈయూల మార్కెట్ పరిమాణం 24లక్షల కోట్ల డాలర్లని అంచనా. దీన్నిబట్టి చూస్తే, ద్వైపాక్షిక వాణిజ్యం మరెంతో వృద్ధి చెందడానికి అవకాశముందన్న మాట. ఇప్పుడు ఎఫ్‌టీఏ ఈ అంశంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. ఉభయ పక్షాల మేధా హక్కుల రక్షణకూ ఎఫ్‌టీఏలో ఏర్పాట్లు ఉన్నాయి. భారతీయ సంప్రదాయ విజ్ఞాన డిజిటల్ గ్రంథాలయాన్ని ఈయూ గుర్తించి సాంకేతిక సహకారం అందిస్తుంది.



### ఈయూకు ఇవీ ప్రయోజనాలు

తాజా ఒప్పందంతో అనేక ఈయూ వ్యవసాయ ఉత్పత్తులపైనా, ప్రాసెస్ చేసిన ఆహార ఎగుమతుల మీదా భారత్ సుంకాలు తగ్గించడమో, తొలగించడమో చేస్తుంది. ఈయూ దేశాలు పంపే ఆలివ్, ఇతర వంట నూనెల మీద ప్రస్తుతం విధిస్తున్న 45శాతం సుంకాలను ఎత్తివేస్తుంది. పండ్ల రసాలు, ఆల్కహాల్ లేని బీర్లపై విధిస్తున్న 55శాతం సుంకాలను తొలగిస్తుంది. ఈయూ నుంచి వచ్చే గొర్రె, మేక మాంసాల మీద విధిస్తున్న 33శాతం పన్ను సైతం రద్దవుతుంది. రొట్టె, పాస్తా, చాక్లెట్లు, బిస్కెట్లపై గతంలో 50శాతం వరకు సుంకాలు విధించేవారు. ఇప్పుడు వాటిని ఎత్తివేస్తారు. ఇక ఐరోపా దేశాల నుంచి ఎగుమతయ్యే మద్యాల మీద సుంకాలను దశలవారీగా తగ్గిస్తారు. ప్రీమియం వైన్ రకాల మీద సుంకాలు 150 నుంచి 20శాతానికీ; మధ్య శ్రేణి వైన్ల మీద 30శాతానికీ తగ్గుతాయి. బ్రాందీ, విస్కీ, వోడ్కాల వంటి మద్యాలపై సుంకాలు 150శాతం నుంచి 40శాతానికి దిగివస్తాయి. ఫలితంగా భారత్‌కు ఈయూ దేశాల నుంచి శుద్ధి చేసిన ఆహారాలు, మద్యాల ఎగుమతులు పెరుగుతాయి. వాటివల్ల ఈయూలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అదే సమయంలో భారత్ ఎగుమతి చేసే చక్కెర, ఇథనాల్, బియ్యం, గోధుమలు, గొడ్డు మాంసం, పాల పొడులు, అరటి, తేనెలకు ఈయూ ఎలాంటి రాయితీలూ ఇవ్వదు. భారతీయ వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహారోత్పత్తులకు పారిశుద్ధ్య ప్రమాణాలను వర్తింపజేస్తుంది. ఈయూలోని ఉన్నతాదాయ వర్గాల కోసం భారత్ ఎగుమతి చేసే కాఫీ, తేయాకు, మసాలా దినుసులు, ద్రాక్ష, ఘెర్కిన్స్, ఉల్లి పొడి, కొన్ని రకాల ప్రాసెస్డ్ ఆహారానికి ప్రాధాన్యం లభిస్తుంది. భారత్ తన ఆహార ధాన్యాలు, పాడి ఉత్పత్తులు, సోయా, కోళ్ల పరిశ్రమలకు ఈయూ ఎగుమతుల నుంచి ముప్పు లేకుండా చూసుకోవడం హర్షణీయం. ఈయూ ఎగుమతులపై సుంకాల్లో సగాన్ని తక్షణమే తొలగిస్తుంది. మిగిలినవి 5-10 ఏళ్లలో క్రమంగా తొలగిపోతాయి. కొన్ని రకాల పండ్లపై పాక్షికంగా సుంకాలు తగ్గించడం, కోటా ప్రకారం అనుమతులివ్వడం చేస్తుంది. మరోవైపు, ఈయూ హైటెక్ ఉత్పత్తులు భారత్‌కు మరింతగా అందుబాటులోకి వస్తాయి. దీనివల్ల వివిధ దేశాల నుంచి హైటెక్ వస్తువులను దిగుమతి చేసుకునే వెసులుబాటు ఇండియాకు లభిస్తుంది. తద్వారా పారిశ్రామిక, హరిత ఇంధన రంగాలకు సంబంధించి అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భారత్ భాగస్వామి కాగలుగుతుంది. విభిన్న అంశాల్లో వీలైనంత వరకూ ఉభయులకూ ప్రయోజనకరంగా ఉండేలా ఎఫ్‌టీఏలో జాగ్రత్తలు తీసుకోవడాన్ని ఇక్కడ గమనించాలి.

### రైతులపై అపార ప్రభావం

ఈయూ వ్యవసాయ ఎగుమతులకు భారత్ రాయితీలివ్వడం ఇదే మొదటిసారి. అయితే, అక్కడ అధికంగా ఉత్పత్తి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు భారత్‌లోకి సుంకాలు లేకుండా ప్రవేశించడానికి ఎఫ్‌టీఏ అనుమతిస్తోందనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మన వ్యవసాయ సరకుల ధరలు పడిపోవడానికి దారితీయవచ్చంటున్నారు. వైన్, బీరు, ఆలివ్ నూనెల వంటి ఖరీదైన ఉత్పత్తులను ఇండియాకు పెద్దయెత్తున ఎగుమతి చేయడం ద్వారా ఐరోపా రైతులు అధికాదాయం పొందగలుగుతారు. కానీ, తమ ఎగుమతుల ద్వారా భారతీయ రైతులు కూడా అదే స్థాయిలో లబ్ధి పొందుతారా? అంటే సందేహమే. తెగుళ్ల బెడద లేని పంటల ఉత్పత్తి, ఎగుమతులకు సంబంధించిన ఫైటో శానిటరీ ప్రమాణాలను ఐరోపాలో కచ్చితంగా పాటిస్తారు. మన దగ్గర ఇంకా ఆ పద్ధతి లేదు. అలాంటి ప్రమాణాలు లేని భారతీయ ఎగుమతులను ఐరోపా అడ్డుకుంటుంది. మన పంటల్లో హానికర రసాయనాలు, పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా ఉన్నాయని ఈయూ దేశాలు వాటిని తిరస్కరిస్తున్నాయి. కాబట్టి, ఈయూ ఆహారోత్పత్తులు మన దేశంలోకి నిరాటంకంగా ప్రవేశించగలుగుతాయి కానీ, మన ఉత్పత్తులు అక్కడకు వెళ్లడం కష్టమవుతుంది. ఫైటో శానిటరీ ప్రమాణాలను మన రైతులు పాటించడానికి చాలా సమయం పడుతుంది. అంతవరకు మన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం తప్పకపోవచ్చు. ఈయూ ప్రభుత్వాలిస్తున్న భారీ సబ్సిడీల వల్ల ఆ దేశాల నుంచి చవకగా వ్యవసాయోత్పత్తులు ఇండియాలోకి వచ్చిపడతాయి. వ్యవసాయ సరకులకు సంబంధించి ఈయూతో కుదుర్చుకున్న నిబంధనల వంటివే తమకూ వర్తింపజేయాలని అమెరికా పట్టుబట్టక మానదు. ఇలా అమెరికా, ఐరోపాల నుంచి ఎదురయ్యే పోటీని మన సాగురంగం ఎంతవరకు తట్టుకుంటుందో చూడాలి!

## గల్లీ బాగుంటేనే.. ఢిల్లీ బాగుంటుంది! పురపాలక ఎన్నికలను నిర్లక్ష్యం చేయకండి

మైకులు మూగబోయాయి. వీధివీధినా హోరెత్తించిన ప్రచార ఆర్భాటాలు, డప్పుల మోతలు, కార్యకర్తల కోలాహలం సద్దుమణిగింది. ఇప్పుడు మిగిలింది నిశ్శబ్దం. కానీ, ఇది మామూలు నిశ్శబ్దం కాదు, ఒక పౌరుడిగా మనం ఆలోచించాల్సిన సమయం. నేడు జరగబోయే పురపాలక సంఘాల ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీల బలపరీక్ష కాదు, అది మన ఇంటి ముందున్న రోడ్డు భవిష్యత్తును, మన పిల్లలు తాగే నీటి నాణ్యతను, మన కాలనీ ఆరోగ్య స్థితిగతులను నిర్ణయించే ఒక ప్రజాస్వామ్య యజ్ఞం. మైకులు మూగబోయాయి. వీధివీధినా హోరెత్తించిన ప్రచార ఆర్భాటాలు, డప్పుల మోతలు, కార్యకర్తల కోలాహలం సద్దుమణిగింది. ఇప్పుడు మిగిలింది నిశ్శబ్దం. కానీ, ఇది మామూలు నిశ్శబ్దం కాదు, ఒక పౌరుడిగా మనం ఆలోచించాల్సిన సమయం. నేడు జరగబోయే పురపాలక సంఘాల ఎన్నికలు కేవలం రాజకీయ పార్టీల బలపరీక్ష కాదు, అది మన ఇంటి ముందున్న రోడ్డు భవిష్యత్తును, మన పిల్లలు తాగే నీటి నాణ్యతను, మన కాలనీ ఆరోగ్య స్థితిగతులను నిర్ణయించే ఒక ప్రజాస్వామ్య యజ్ఞం.

### రౌడీయిజానికి రాజకీయం ముసుగు వేస్తే..!

సాధారణంగా పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు ఇచ్చినంత ప్రాధాన్యత, స్థానిక సంస్థల ఎన్నికలకు విద్యావంతులు, పట్టణ ప్రజలు ఇవ్వరనేది ఒక చేదు నిజం. 'ఎవరు గెలిచినా మనకేంటి?' అనే నిర్లిప్తత మన పట్టణాల ప్రగతికి ప్రధాన అవరోధంగా మారుతోంది. ఈ నేపథ్యంలో, ఎల్లుండి మనం వేయబోయే ఓటు విలువను, బరువును మరోసారి బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దొంగలకు సద్ది కట్టకండి.. అవినీతి అభ్యర్థులకు ఓటేయకండి!

### మున్సిపల్ కార్యాలయమే మన జీవిక..

నిజానికి ఒక సామాన్యుడి దైనందిన జీవితాన్ని అత్యంత ప్రభావితం చేసేది ఢిల్లీలోని పార్లమెంటు కాదు, హైదరాబాద్ లోని అసెంబ్లీ అంతకన్నా కాదు. మన జీవితాలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసేది మన ఇంటికి కూతవేటు దూరంలో ఉండే మున్సిపల్ కార్యాలయమే. ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు మనకు అవసరమైన మంచినీళ్లు, నడిచే రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, దోమల నివారణ, ధృవీకరణ పత్రాలు ఇవన్నీ పురపాలక సంఘం పరిధిలోనివే.. మన ఇంటి ముందు మురుగు కాల్వ పొంగితే మనం ప్రధానికో, ముఖ్యమంత్రికో ఫోన్ చేయలేం, స్థానిక కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ మాత్రమే మనకు దిక్కు. ఎమ్మెల్యేలు, ఎంపీలు విధాన నిర్ణయాలు చేస్తే, కార్పొరేటర్లు క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరిస్తారు..

కాకినాడ.. హరిత శక్తి విప్లవానికి కొత్త చిరునామా!

విమర్శిస్తారు.. ఓటెయ్యరు..!

అందుకే, ఒక రకంగా చెప్పాలంటే అసెంబ్లీ ఎన్నికల కంటే మున్సిపల్ ఎన్నికలే మన జీవన ప్రమాణాలకు అత్యంత కీలకమైనవి. దురదృష్టవశాత్తు, పట్టణాల్లో ఉండే విద్యావంతులు, ఉద్యోగులు, యువత.. సోషల్ మీడియాలో ప్రభుత్వాలను విమర్శించడానికి చూపించే ఆసక్తిలో సగం కూడా ఓటు వేయడానికి చూపించడం లేదు. ట్విట్టర్‌లో గుంతల రోడ్ల ఫోటోలు పెట్టి ప్రభుత్వాన్ని తిడితే సరిపోదు,




ఆ రోడ్లు వేయించే సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే బాధ్యత కూడా మనదే.

### మదుపర్లకు భద్రత.. మార్కెట్‌కు ముప్పు!

### ఎన్నికల రోజు హాలిడేనా?

ఎన్నికల రోజును చాలామంది 'హాలిడే'గా భావిస్తారు. ఆరోజు సినిమాకో, షికారుకో వెళ్లడానికో లేదా ఇంట్లో విశ్రాంతి తీసుకోవడానికో కేటాయిస్తారు. 50 శాతం పోలింగ్ కూడా దాటని డివిజన్లు ఉన్నాయంటే, అది మన పౌర సమాజపు బాధ్యారాహిత్యానికి నిదర్శనం కాదా? మనం ఓటు వేయకపోతే, చైతన్యం లేనివారో, లేదా కేవలం డబ్బుకు ఆశపడేవారో వెళ్లి ఓటు వేస్తారు. ఫలితంగా సమర్థత లేని వ్యక్తులు, రౌడీయిజం చేసే వ్యక్తులు, భూకబ్జాదారులు మన పాలకులుగా ఎన్నికవుతారు. ఆ తర్వాత ఐదేళ్లు వ్యవస్థను తిట్టుకోవడం వల్ల ప్రయోజనం శూన్యం. 'నోటా' మీట నొక్కడానికైనా పోలింగ్ బూతుకు వెళ్లాలి తప్ప, ఓటు వేయకుండా ఇంట్లో కూర్చోవడం ప్రజాస్వామ్య ద్రోహం. ఇక నేటి ఎన్నికలు ధన ప్రవాహానికి చిరునామాగా మారుతున్నాయి..

### నోటు తీసుకుని ఓటు వేస్తే...

'ఓటుకు నోటు' అనే సంస్కృతి గల్లీ స్థాయికి పాకింది. సాయంత్రం ఇచ్చే మందు సీసాకో, బిర్యానీ ప్యాకెట్‌కో, లేదా వెయ్యి, రెండు వేల రూపాయల నోటుకో ఓటును తాకట్టు పెడితే.. మనం కోల్పోయేది కేవలం ఒక హక్కును మాత్రమే కాదు, మన ఆత్మగౌరవాన్ని కూడా.. ఒక్కసారి ఆలోచించండి.. ఒక అభ్యర్థి ఓటుకు రూ. 2000 ఇచ్చాడను కుందాం. ఐదేళ్లలో మనం అతనికి అమ్ముకున్న విలువ రోజుకు ఒక్క రూపాయి మాత్రమే! మన ఆత్మగౌరవం విలువ రోజుకు ఒక్క రూపాయి నాణేమా? డబ్బులు ఇచ్చి గెలిచిన నాయకుడు, రేపు పదవిలోకి వచ్చాక తను పెట్టిన పెట్టుబడిని వడ్డీతో సహా రాబట్టుకోవడానికి చూస్తాడే తప్ప, మన కాలనీ రోడ్లు బాగుచేయడానికి చూడడు.. రేపు మన వార్డులో సమస్య వచ్చినప్పుడు ఆ నాయకుడిని ప్రశ్నించే నైతిక హక్కును మనం కోల్పోతాం. అమ్ముడుపోయే ఓటరు ఉన్నంత కాలం, కొనుగోలు చేసే నాయకుడు పుట్టుకొస్తూనే ఉంటాడు.

### గల్లీ బాగుంటేనే.. ఢిల్లీ బాగుంటుంది!

కాబట్టి, పార్టీ జెండాలను, కులాలను, మతాలను పక్కన పెట్టి.. అభ్యర్థి వ్యక్తిత్వం ఆధారంగా ఓటు వేయాలి. ఆ అభ్యర్థి స్థానికుడేనా? మనకు కష్టం వస్తే ఫోన్ ఎత్తుతాడా? మన వార్డు సమస్యలపై అతనికి అవగాహన ఉందా? అన్నది ఆలోచించాలి. రౌడీ షీటర్లు, భూకబ్జా ఆరోపణలు ఉన్నవారిని ఎన్నుకుంటే, రేపు మన ఇంటి స్థలానికే ఎసరు పెడతారు. ప్రశాంతంగా ఉన్న కాలనీల్లో గొడవలు సృష్టిస్తారు. అదే చదువుకున్న వారు, సామాజిక స్పృహ ఉన్నవారు కౌన్సిల్‌లో ఉంటే.. పట్టణ ప్రణాళిక, నిధుల వినియోగం సక్రమంగా జరుగుతుంది. ఈ క్రమంలో యువత, మహిళల పాత్ర కీలకం. ఇంటిని చక్కదిద్దే మహిళలకు, వీధిలో వచ్చే కుళాయి నీళ్ల కష్టం, చెత్త సమస్య బాగా తెలుసు. అందుకే, మహిళలు తమ ఓటును స్వతంత్రంగా వినియోగించుకోవాలి. 'గల్లీ బాగుంటేనే... ఢిల్లీ బాగుంటుంది' అన్నది నానుడి. రేపు జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.. పోలింగ్ బూతుకు వెళ్లడం ఒక ప్రయాస

## విశ్వగురు భావన ఓ భ్రమ!

దేశంలో గడిచిన పదకొండేండ్లుగా విదేశాంగ విధానంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రపంచ నాయకత్వంగా, విశ్వగురు పేరిట ప్రచారం జరుగుతున్నది. కానీ జాగ్రత్తగా పరిశీలించి విశ్లేషిస్తే ఇందులో లోపాలు గమనించవచ్చు. విశ్వగురు భావనలో స్పష్టత, స్థిరత్వం లోపించిందని గుర్తించవచ్చు. మోదీ రాజనీతిలో లోపాలు బయటపడుతాయి. విదేశీ పర్యటనల్లో ఆర్భాటపు కార్యక్రమాలు, జరిగిన వ్యూహాత్మక ప్రయోజనానికి పొంతన ఉండదు. మాటల్లో చెప్పుకున్నంత మేరకు లక్ష్యాలను చేరుకోలేదని, ఫలితాలు సాధించలేదని తెలిసిపోతుంది. ప్రస్తుతం భారతదేశంలో వ్యవసాయ మార్కెట్‌లోకి అమెరికాను ఆహ్వానించడం వెనుక మన పాలకులపై ఉన్న ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది మన దేశ రైతుల జీవనాధారాన్ని దెబ్బతీస్తుంది. ఇటీవలి కాలంలో జరిగిన రైతు ఆందోళనల నేపథ్యంలో అన్నదాతలకు మరిన్ని సమస్యలు పొంచి ఉన్నాయని స్పష్టమవుతున్నది. నరేంద్రమోదీ ప్రధానిగా 79 దేశాల్లో 97 సార్లు పర్యటించారు. అంటే సగటున ఏడాదికి 9 సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారన్నమాట. ప్రధాని మోదీ ఇన్ని దేశాలకు ఇన్నిసార్లు వెళ్లి వచ్చినా ఆయా దేశాలతో వాణిజ్య, వ్యూహాత్మక, సాంస్కృతిక రంగాల్లో లోతైన సంబంధాలు ఏమైనా నిర్మించారా? అనే ప్రశ్న తలెత్తుతున్నది. కానీ అంతర్జాతీయంగా ఫలితాలను చూస్తే పరిస్థితులు నిరాశాజనకంగానే ఉన్నాయి. భారతదేశ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్ 2013లో 74వ స్థానంలో ఉంటే పదకొండేండ్ల విశ్వగురు పాలనలో 80వ స్థానానికి పడిపోయింది. ఇక విదేశీ ప్రత్యక్ష నికర పెట్టుబడులు (నెట్ ఎఫ్‌డీఐ) కేవలం 0.35 బిలియన్ డాలర్ల వద్ద నిలిచిపోయాయి. అంటే పెట్టుబడుల ప్రవాహం పరిమితంగానే ఉన్నదని స్పష్టమవుతున్నది. వాణిజ్యం, పర్యాటకం నిర్మాణాత్మకంగా పెరగలేదు. ఇక విదేశాలతో భద్రతాపరమైన సంబంధాల్లోనూ సాధించింది ఏమీ లేదనే విషయం అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సహజమైన మద్దతు లభించాల్సిన విషయంలో భారత వైఖరిని విదేశాల్లో వివరించే ఎంపీల బృందానికి ప్రధానంగా విపక్ష ఎంపీలు నాయకత్వం వహించాల్సి వచ్చింది. గతంలో జాతీయ నేతలు తమను తాము గురు అని ప్రకటించుకోలేదు. ఎలాంటి ఆర్భా టం లేకుండా మౌనంగానే సమర్థతతో ఘనమైన విజయాలు సాధించారు. ఉదాహరణకు నెహ్రూ హయాంలో అలీన విధానం, ఇందిరాగాంధీ హయాంలో 1971 నాటి దౌత్యం, వాజపేయి పాలనలో లాహోర్ పర్యటనను చెప్పవచ్చు. కానీ మోదీ పాలనలో గుణాత్మక మార్పులు పెద్దగా కనిపించవు. క్వాడ్ పునరుద్ధరణ ద్వారా చైనా దూకుడును కొంతమేరకు మాత్రమే అడ్డుకోగలిగారు. జీ20కి ఆతిథ్యం, ఆఫ్రికన్ యూనియన్ చేరిక ఫలితాలనిచ్చాయి. ప్రపంచ ఆర్థిక అస్థిరతల నేపథ్యంలో రష్యా చమురు దిగుమతులతో ఆర్థిక ఉపశమనం లభించింది. ఇండియా, ఇజ్రాయెల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ స్టేట్స్ (ఐ2యూ2) కూటమి ఆరంభ దశలోనే నిలిచిపోయింది. సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. క్వాడ్ నుంచి నిర్ణయాత్మక మద్దతు కనిపించలేదు. వాణిజ్య లోటు వెంటాడుతూనే ఉన్నది. సార్వభౌమత్వం అంటూ మాటలు మోగుతూనే ఉన్నాయి, ఆచరణలో మాత్రం విదేశీ ఒత్తిడులకు తలొగ్గినట్టు కనిపిస్తున్నది. అమెరికా ఒత్తిడితో ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయడం ఇందుకు ఓ ఉదాహరణ. అమెరికా ఒత్తిడితో ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్ల నిలిపివేత తరహాలోనే ఇప్పుడు అమెరికాకు చెందిన మొక్కజొన్న, సోయా, పాల ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతించడం స్పష్టంగా గమనించవచ్చు. భారతదేశంలోని 14 కోట్ల మంది రైతుల్లో 90 శాతం మంది సన్నకారు రైతులే ఉన్నారు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారత మార్కెట్లోకి అనుమతిస్తే మన రైతుల జీవనం ప్రమాదంలో పడుతుంది. కేంద్రం 2020-21లో వ్యవసాయ రంగంలో నల్ల చట్టాలను తీసుకొచ్చింది. తమ భవితవ్యాన్ని కార్పొరేట్ శక్తుల నియంత్రణలో పెట్టడానికి అంగీకరించే ప్రసక్తే లేదని అన్నదాతలు స్పష్టంచేశారు. 1991 నాటి సంస్కరణల తర్వాత చేనేత రంగం కుదేలైనట్టుగానే వ్యవసాయం సంక్షోభం ఎదుర్కొంటుందని ఆందోళన చెందుతున్నారు. లక్షలాది మంది రైతులు 13 నెలలపాటు ఉద్యమించారు. దీంతో కేంద్రం ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నది. ప్రస్తుతం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కోసం రైతులు గొంతెత్తుతున్నారు. అస్థిరమైన ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో చలో ఢిల్లీ అని నినదిస్తూ

## మీరు ఇలా ప్లాన్ చేస్తే - భారం లేకుండా కారు కొనేయొచ్చు!

### టెన్షన్ వద్దనుకుంటే మ్యూచువల్ ఫండ్స్ ప్లాన్ బెస్ట్ అంటున్న ఆర్థిక నిపుణులు - అర్జెంటు లేనివారికి ఈ పద్ధతే మంచిదని సూచన



కారు ఒకప్పుడు విలాసం. ఇప్పుడు అవసరం స్థాయికి వచ్చేసింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఇంటికీ ఓ చిన్న కారు ఉండాల్సిందే అంటున్నారు మెజారిటీ జనం. కానీ, దాన్ని కొనుగోలు చేయడానికి కావాల్సిన డబ్బు ఎలా సమకూర్చుకోవాలన్నదే సమస్య. అయితే, ఒక ప్లాన్ ప్రకారం వెళ్తే పెద్దగా ఆర్థిక భారం లేకుండానే కారు కొనుగోలు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. మరి, ఆ ప్రాసెస్ ఏంటో ఇప్పుడు చూద్దాం. మీరు ఎలాంటి కారు కొనుగోలు చేయాలని అనుకుంటున్నారో ముందుగా డిసైడ్ చేసుకోవాలి. మీకు నచ్చిన ఫీచర్స్ అన్నీ ఉన్న మోడల్ ను సెలక్ట్ చేసుకొని, ఖరీదు ఎంతో నిర్ధారించుకొని, దానికి కమిట్ అయిపోవాలి. ఇప్పుడు మీ వద్ద ఉన్న డబ్బు ఎంత? ఇంకా ఎంత మొత్తం అవసరం పడుతోందన్నది తేల్చుకోవాలి. ఆ అమౌంట్ ను సమకూర్చుకునేందుకు ప్లాన్ మొదలు పెట్టాలి. మన ఆర్థిక స్థాయిని బట్టి నిర్ణయం తీసుకోవాలి. అంతే తప్ప, తలకు మించిన భారాన్ని నెత్తిన వేసుకోకూడదు. అదేవిధంగా ఎవరో చెప్పారని మరో కారు కొనుగోలు చేయడానికి సిద్ధపడకూడదు. మొదట తీసుకున్న నిర్ణయం మార్చుకోకూడదు.

ఇప్పుడు మార్కెట్‌లో మీడియం రేంజ్ కార్లు రూ.7లక్షల నుండి రూ.10లక్షల మధ్య ఉన్నాయి. ఇందులో మీ ఆర్థిక స్థాయిని, అవసరాన్ని బట్టి ఒక మోడల్ ఎంచుకోవాలి. ఉదాహరణకు 7 లక్షల రూపాయలు విలువ చేసే కారు కొనాలని మీరు డిసైడ్ చేసుకున్నారని అనుకుందాం. మీ వద్ద కారుకోసం పొదుపు చేసిన డబ్బు ఏమీ లేదని అనుకుందాం. ఇలాంటి పరిస్థితుల్లో రెండు పద్ధతుల్లో మీరు కారు తీసుకోవచ్చు.

వెంటనే కావాలనుకుంటే :

వెంటనే కారు కావాలని అనుకుంటే లోన్ ద్వారా ముందుకు వెళ్లొచ్చు. బ్యాంకులు చాలా వరకు కారు బడ్జెట్ లో ఏకంగా 80 నుంచి 90 శాతం వరకు లోన్ ఇస్తున్నాయి. మిగతా కొద్ది మొత్తాన్ని మీరు డౌన్ పేమెంట్ చేస్తే సరిపోతుంది. అంటే.. 7 లక్షల రూపాయల కారును కొనేందుకు మీ చేతిలో రూ.1.4 లక్షలు ఉంటే సరిపోతుంది. ఒక్క రోజులో కారు మీ ఇంటి ముందు ఉంటుంది. మిగిలిన డబ్బును రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కానీ.. దీనివల్ల పలు ఇబ్బందులు ఫేస్ చేయాల్సి వస్తుంది. కారు ఒరిజినల్ ధరకే జువీ×ల రూపంలో చాలా ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి వస్తుంది. అంతేకాదు, అధిక వడ్డీతోపాటు లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, జీఎస్టీ అంటూ అడిషనల్ ఛార్జీలు కూడా కట్టాల్సి ఉంటుంది. ఇవన్నీ ఒకెత్తయితే.. 5 నుంచి 7 సంవత్సరాల వరకు ప్రతినెలా టంచన్ గా చెల్లించడం అనేది ఇబ్బందికరమైన అంశం. మనసులో ఈ ఆర్థిక భారం నిత్యం వెంటాడుతూనే ఉంటుంది.

అలా వద్దంటే ఇలా :

ఈ జువీ× బాధలు, అధిక చెల్లింపులు వద్దు అనుకుంటే మరో ప్లాన్ ఉంది. అదే పొదుపు మంత్రం. కానీ, దీనికి ఓపిక కావాలి. ఇప్పుడు ప్లాన్ వేసుకుంటే ఐదేళ్ల తర్వాత కారు ఇంటికి వస్తుంది. దీనికి సిద్ధపడేవారు ముందుగా ఏ కారు కొనాలని అనుకుంటున్నారో ఫైనల్ చేసుకోవాలి. ఆ మోడల్ కారు ధర ఇప్పుడు ఎంత ఉంది? ఐదేళ్ల తర్వాత ఎంత ఉంటుంది అనేది అంచనా వేసుకోవాలి. ఇండియాలో సగటున ప్రతీ ఏటా కార్ల ధరలు 10% చొప్పున పెరుగుతున్నాయి. అంటే.. ఇప్పుడు రూ.7 లక్షల ధర పలుకుతున్న కారు, ఐదేళ్ల తర్వాత దాదాపు రూ.11.50 లక్షలకు చేరుతుంది. ఈ మొత్తాన్ని కూడబెట్టడం మీ టార్గెట్ కావాలి.

ఎలా కూడబెట్టాలి

5 సంవత్సరాల్లో కారు కొనుగోలు చేయడం కోసం మ్యూచువల్ ఫండ్స్ లో ఇన్వెస్ట్ చేయడం మంచి ఆప్షన్ గా ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఇందులోనూ ఈక్విటీ ఫండ్లకు బదులుగా హైబ్రిడ్ ఫండ్లను సెలక్ట్ చేసుకుంటే మంచిదని చెబుతున్నారు. వీటిలో నష్ట భయం కాస్త తక్కువగా ఉంటుంది. హైబ్రిడ్ అంటే ఇటు ఈక్విటీ ఫండ్లలో, అటు డెట్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తాయి. మీరు కారు కొనడానికి రూ.11.50 లక్షలను ఐదేళ్లలో సంపాదించాలన్నది టార్గెట్. ఈ మొత్తాన్ని పొందడానికి మీరు నెలకు ఎంత పొదుపు చేయాలో ఇక్కడ చూద్దాం. మ్యూచువల్ ఫండ్స్ లో 8శాతం రాబడి అంచనా వేసుకుంటే మీరు గరిష్టంగా నెలకు రూ. 15,548 పొదుపు చేయవచ్చు 10 శాతం రాబడి అంచనా వేసుకుంటే నెలకు రూ. 14,728 పొదుపు చేయాలి 12 శాతం రాబడి అంచనా వేసుకుంటే నెలకు రూ. 13,942 పొదుపు చేయాలి ఇందులో 15,548 రూపాయలను పొదుపు చేయడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ఎందుకంటే మ్యూచువల్ ఫండ్స్ రాబడి మార్కెట్ ఒడిదొడుకుల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి, తక్కువలో తక్కువ 8 శాతం రాబడిని అంచనా వేసుకుని పొదుపు చేస్తున్నారు కాబట్టి మీరు ఎంచుకున్న కారును తేలిగ్గా కొనగలరు. ఒకవేళ 8 శాతం కన్నా ఎక్కువ రాబడి వస్తే మీకు అదనపు సొమ్ము అందుతుంది. దాంతో మీరు ఇంకా మెరుగైన మోడల్ కారును కొనుగోలు చేయవచ్చని సూచిస్తున్నారు. అంతేకాకుండా.. ఇలా డబ్బు మొత్తం జమ చేసుకొని కారు కొనుగోలు చేయడం వల్ల టెన్షన్ కూడా ఉండదని, ప్రశాంతంగా మీ లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ రెండు పద్ధతుల్లో మీకు నచ్చిన పద్ధతిని ఎంచుకొని కారు కొనుగోలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## న్యూజిలాండ్- పాకిస్థాన్ మ్యాచ్ రద్దు

## పాక్ సెమీస్ పోరు ఇక 'డూ ఆర్ డై'!

### వరల్డ్ కప్ సూపర్ 8- వర్షం కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే న్యూజిలాండ్- పాకిస్థాన్ మ్యాచ్ రద్దు- ఇరుజట్లకు చెరో పాయింట్




సూపర్ 8లో తొలి మ్యాచ్ వర్షార్పణం అయ్యింది. శనివారం కొలంబో వేదికగా న్యూజిలాండ్- పాకిస్థాన్ మధ్య జరగాల్సిన సూపర్ 8 మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. టాస్ వేసే సమయానికి వాతావరణం బాగానే ఉంది. టాస్ నెగ్గిన పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే ఆట ప్రారంభమయ్యే సమయానికి వర్షం మొదలైంది. క్రమంగా భారీగా కురిసింది. దీంతో అనుకున్న టైమ్ కు మ్యాచ్ ప్రారంభం కాలేదు. వర్షం ఎక్కువవడంతో ఆట ఆలస్యం అవుతూ వచ్చింది. ఓవర్లు కుదించి అయినా ఆట నిర్వహించే ఆలోచనలు చేశారు. కానీ ఔట్ ఫీల్డ్ చిత్తడిగా ఉండడంతో చివరకు మ్యాచ్ నిర్వహించే అవకాశం లేకుండా పోయింది. దీనికి రిజర్వ్ డే లేకపోవడం వల్ల ఆటను రద్దు చేయాల్సి వచ్చింది. ఇరుజట్లకు చెరో పాయింట్ ఇస్తూ మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. పాకిస్థాన్ సెమీస్ అవకాశాలపై ఎఫెక్ట్! అయితే ఇక్కడే ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో అత్యంత కీలకమైన సూపర్-8 దశ అనూహ్య మలుపు తిరిగింది. ఈ పాయింట్ల పంపకం న్యూజిలాండ్ కంటే పాకిస్థాన్‌కే ఎక్కువ నష్టం చేకూర్చేలా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సూపర్-8 వంటి కీలక దశలో పాయింట్లు కోల్పోవడం ఏ జట్టుకైనా ప్రమాదకరమే. ముఖ్యంగా గ్రూప్-2లో ఉన్న పాకిస్థాన్‌కు ఇప్పుడు ప్రతి మ్యాచ్ సెమీఫైనల్ లాంటిదే. ప్రస్తుతం లభించిన ఒక పాయింట్‌తో పాక్ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నప్పటికీ, తదుపరి సమీకరణాలు అత్యంత క్లిష్టంగా మారాయి. పాకిస్థాన్ తన తదుపరి రెండు మ్యాచ్‌ల్లో- ఫిబ్రవరి 24న బలమైన ఇంగ్లాండ్‌తో, ఫిబ్రవరి 28న ఆతిథ్య శ్రీలంకతో తలపడనుంది. ఈ రెండింటిలోనూ విజయం సాధిస్తేనే పాక్ ఖాతాలో 5 పాయింట్లు చేరుతాయి. అప్పుడు ఎటువంటి సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా సెమీస్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. లేకుంటే ఇక అంతే సంగతులు. అందుకే తదుపరి రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమి పాలైతే మాత్రం పాక్ జట్టు మరో ఆలోచన లేకుండా టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. నెట్ రన్ రేట్ ఒకవేళ పాకిస్థాన్ ఒక మ్యాచ్‌లో గెలిచి, మరో మ్యాచ్‌లో ఓడిపోతే వారి పాయింట్లు 3 వద్దే నిలిచిపోతాయి. అప్పుడు ఆ జట్టు భవితవ్యం ఇతర జట్ల (ఇంగ్లాండ్, శ్రీలంక) గెలుపోటములపై, నెట్ రన్ రేట్‌పై ఆధారపడి ఉంటుంది. శ్రీలంక స్వదేశంలో మంచి బలంగా ఉండటం పాక్‌కు అదనపు ఆందోళన కలిగించే అంశం. న్యూజిలాండ్‌కూ అదే పరిస్థితి! ఇటు పాకిస్థాన్‌తో పాటు న్యూజిలాండ్ పరిస్థితి కూడా అలానే ఉంది. కివీస్ జట్టుకు ఉన్న మెరుగైన బౌలింగ్ వనరులు, ఫీల్డింగ్ ప్రమాణాలు వారిని రేసులో నిలబెడుతున్నాయి. అయితే, వారు కూడా తమ తదుపరి మ్యాచుల్లో ఒత్తిడిని అధిగమించాల్సి ఉంటుంది. ప్రస్తుతం శ్రీలంకలో రుతుపవనాల ప్రభావం వల్ల వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్థితి. రానున్న మ్యాచ్‌లకు కూడా వర్షం ముప్పు పొంచి ఉండటం, ఆయా జట్ల మేనేజ్‌మెంట్లను కలవరపెడుతోంది. ఐసీసీ నిబంధనల ప్రకారం, సూపర్-8 మ్యాచ్‌లు వర్షం కారణంగా పూర్తిగా రద్దయితే, గ్రూప్ దశలో ప్రదర్శన లేదా ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది తక్కువ పాయింట్లు ఉన్న జట్లకు శాపంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి, పాకిస్థాన్ సెమీస్ చేరాలంటే వరుణుడి కరుణతో పాటు, కచ్చితంగా గెలిచితీరాలి. లేదంటే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి వస్తుంది. మొత్తానికి ఫిబ్రవరి 24న ఇంగ్లాండ్‌తో జరిగే పోరు పాక్ జట్టు భవితవ్యాన్ని తేల్చనుంది.

## విటమిన్ 'కె' లోపంతో చాలా ఆరోగ్య సమస్యలు! - ఈ లక్షణాలు కనిపిస్తే అలర్ట్ కావాలంటున్న నిపుణులు!

### విటమిన్ లోపంతో బాధపడుతున్నారా

### ఇలా భర్తీ చేసుకోవాలని వైద్య నిపుణుల సూచన



విటమిన్ ఖ అనేది రక్తం గడ్డకట్టడం, ఎముకల ఆరోగ్యం, గుండె పనితీరులో కీలక పాత్ర పోషించే ఒక ముఖ్యమైన పోషకం. శరీరంలో అనవసర కణాలను తొలగించి కొత్త కణాలను తయారు చేసే ప్రక్రియలో ఈ విటమిన్ చాలా ముఖ్యం. తద్వారా రోగనిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. అయితే, విటమిన్ జ లేదా ఐ తో పోలిస్తే దీనికి తక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. దీంతో అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో కె విటమిన్ లోపం వల్ల ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం! విటమిన్ ఖ రెండు రూపాల్లో ఉంటుంది. ఖ1, ఇది రక్తం గడ్డకట్టడానికి సహాయపడుతుంది. ఖ2, ఇది క్యాల్షియం మృదు కణజాలాలలో పేరుకుపోకుండా నేరుగా ఎముకలకు చేరేలా చూస్తుంది. ఈ విటమిన్ లోపం స్వల్పంగా ఉన్నా సరే.. సులభంగా గాయాలవ్వడం, రక్తస్రావం ఆగకపోవడం, ఎముకల బలహీనత, అలసట వంటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఈ హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించి, ఆహారం, సప్లిమెంట్స్ లేదా జీవనశైలి మార్పుల ద్వారా సరిచేసుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యల నుండి కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. విటమిన్ ఖ లోపం వల్ల విపరీతమైన రక్తస్రావం, ఎముకల పెరుగుదల సరిగ్గా లేకపోవడం, ఆస్టియోపోరోసిస్, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అధ్యయనం పేర్కొంది.

తరచుగా గాయాలు :

అత్యంత సాధారణ లక్షణాలలో విటమిన్ ఖ లోపం ఒకటి. చాలా మందిలో కనిపిస్తుంది. దీనివల్ల చిన్న దెబ్బలకే చర్మం కమిలిపోవడం లేదా గాయాలు అవుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. దెబ్బ తీవ్రత చిన్నదే అయినప్పటికీ, నల్లటి లేదా ఊదా రంగు మచ్చలు ఎక్కువగా ఏర్పడతాయని చెబుతున్నారు. ఒకవేళ మీ శరీరంలో ఇటువంటి అసాధారణమైన గాయాలను తరచూ గమనిస్తుంటే.. విటమిన్ ఖ స్థాయిలను చెక్ చేసుకోవాలని సూచిస్తున్నారు.

అధిక ఋతుస్రావం :

విటమిన్ ఖ లోపిస్తే రుతుస్రావం ఎక్కువ సేపు లేదా తీవ్రంగా జరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అధిక రక్తస్రావానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ, విటమిన్ ఖ లోపాన్ని తరచుగా విస్మరిస్తుంటారు చాలామంది. దీనిని ఆహారం లేదా సప్లిమెంట్స్ ద్వారా సరిచేయవచ్చని సలహా ఇస్తున్నారు.

గోళ్ల కింద చిన్న రక్తపు గడ్డలు :

చేతి గోళ్లు లేదా కాలి గోళ్ల కింద కనిపించే ముదురు రంగు గీతలు, చిన్న రక్తపు గడ్డలు విటమిన్ ఖ లోపానికి ఒక సూక్ష్మ సంకేతం కావచ్చంటున్నారు. ఏదైనా దెబ్బ తగలడం వల్ల వచ్చే తెల్లటి మచ్చల కంటే భిన్నంగా ఉంటాయని చెబుతున్నారు. ఎటువంటి గాయమూ కాకపోయినా ఇవి ఏర్పడుతుంటాయట. రక్తనాళాలు బలహీనపడటం, రక్తం గడ్డకట్టే కారకాలు తగ్గడం వల్ల ఇటువంటి చిన్న రక్తస్రావాలు జరుగుతుంటాయని పేర్కొంటున్నారు. ఇవి నేరుగా ప్రమాదకరం కానప్పటికీ, శరీరంలోని 'క్లాటింగ్ సిస్టమ్' సరిగ్గా పనిచేయడం లేదనడానికి ఇవి స్పష్టమైన సంకేతాలని పేర్కొంటున్నారు.

చిగుళ్ల నుండి రక్తస్రావం :

బ్రష్ లేదా ఫ్లాసింగ్ చేసినప్పుడు చిగుళ్ల రావడం అనేది విటమిన్ ని లోపానికి సంకేతమని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా, రోజువారీ నోటి శుభ్రత సమయంలో చిగుళ్ల నుంచి రక్తం రాకూడదు. విటమిన్ ఖ స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు రక్తనాళాల పటిష్టత తగ్గి, అవి త్వరగా రక్తస్రావానికి గురవుతాయని అంటున్నారు. నోటి పరిశుభ్రత అలవాట్లలో మార్పు లేకపోయినా, రక్తస్రావం పెరుగుతుంటే ఈ లక్షణాన్ని గమనించాలని సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా దంత సంరక్షణ తీసుకున్నప్పటికీ చిగుళ్ల నుంచి రక్తం కారుతుంటే, డాక్టర్‌ని సంప్రదించడం మంచిదట.

మలమూత్రాలలో రక్తం :

మలంలో లేదా మూత్రంలో రక్తం కనిపించడం అనేది విటమిన్ ఖ లోపంతో ముడిపడి ఉన్న తీవ్రమైన సంకేతం అంటున్నారు నిపుణులు. మలంలో ఎర్రటి చారలు లేదా నల్లటి తారు వంటి మలం, అలాగే గులాబీ రంగులో ఉండే మూత్రం వంటివి జీర్ణవ్యవస్థ లేదా మూత్రనాళంలో రక్తస్రావాన్ని సూచిస్తాయని చెబుతున్నారు. విటమిన్ ఖ లోపం మాత్రమే దీనికి ఏకైక కారణం కానప్పటికీ, ఇతర క్లాటింగ్ సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లు దీనిని ఒక ముఖ్యమైన అంశంగా పరిగణిస్తారని పేర్కొంటున్నారు. ఇటువంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే డాక్టర్ సలహా తీసుకోవడం మేలట.

చిన్న గాయాల నుంచి అధిక రక్తస్రావం :

విటమిన్ ఖ లోపం ఉన్నప్పుడు చిన్న కోతలు, షేవింగ్ చేసుకునేటప్పుడు అయ్యే గాయాలు లేదా దంత చికిత్సల సమయంలో సాధారణం కంటే ఎక్కువ సమయం రక్తస్రావం జరగవచ్చని చీఃఅశీఅఖ్రీ ాఅఎఖ్తీఎ శీట వీవఎఅఏఅఅవ అధ్యయనం పేర్కొంది. మామూలుగా, అయితే ప్రాథమిక చికిత్సతో నిమిషాల వ్యవధిలోనే రక్తం ఆగాలి, కానీ ఈ విటమిన్ లోపం వల్ల రక్తస్రావం చాలా సేపు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. చిన్న గాయాలకు శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం ద్వారా లోపాలను గుర్తించవచ్చని తెలియజేస్తున్నారు.

ఆస్టియోపోరోసిస్ :

ఎముకల ఆరోగ్యానికి విటమిన్ ఖ2 చాలా అవసరం. ఎందుకంటే, ఇది శరీరం క్యాల్షియాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడే ప్రొటీన్లను ఉత్తేజితం చేస్తుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, 'ఆస్టియోకాల్సిన్' అనే ప్రొటీన్ క్యాల్షియంను ఎముకలతో బంధించి, అవి దృఢంగా ఉండేలా చేస్తుందని చెబుతున్నారు. తగినంత ఖ2 లేకపోతే, క్యాల్షియం ఎముకల్లో సరిగ్గా చేరదు, దీనివల్ల ఆస్టియోపోరోసిస్, ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుందని ఫ్రమఖ్రీఫ్రఎఅతీవష్.ఫ్రశీజ.ఖబ అధ్యయనం పేర్కొంది. ఎముకల బలాన్ని కాపాడటంలో విటమిన్ ఖ2, క్యాల్షియం, విటమిన్ ణ3తో కలిసి కీలక పాత్ర పోషిస్తుందట.

మృదు కణజాలాలలో క్యాల్షియం పేరుకుపోవడం :

విటమిన్ ఖ2 స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు, క్యాల్షియం ఎముకలకు వెళ్లకుండా మృదు కణజాలాలలో పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ధమనులు, గుండె కవాటాలు లేదా మూత్రపిండాలలో జరగవచ్చని అంటున్నారు. దీనివల్ల కాలక్రమేణా గుండె, మూత్రపిండాల సమస్యలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మృదు కణజాలాలలో క్యాల్షియం పేరుకుపోకుండా నిరోధించే ప్రొటీన్లను విటమిన్ ఖ2 ఉత్తేజితం చేస్తుందని, తద్వారా గుండె, రక్తనాళాల ఆరోగ్యాన్ని కాపాడుతుందని పేర్కొంటున్నారు.

అలసట,బలహీనత :

కారణం తెలియని అలసట లేదా బలహీనత కొన్నిసార్లు విటమిన్ ఖ లోపానికి సంకేతం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో నిరంతరం జరిగే సూక్ష్మ రక్తస్రావం వల్ల లేదా క్యాల్షియం వినియోగం సరిగ్గా లేకపోవడం వల్ల శక్తి స్థాయిలు తగ్గి ఇలా జరగవచ్చంటున్నారు. అలసటకు చాలా కారణాలు ఉన్నప్పటికీ, విటమిన్ ఖ వంటి పోషకాహార లోపాలను చికిత్స ద్వారా సరిచేయవచ్చని తెలియజేస్తున్నారు. ఇతర లక్షణాలతో పాటు నిరంతరంగా అలసట అనిపిస్తుంటే, పోషకాహార పరీక్షలు చేయించుకోవడం అవసరమని సూచిస్తున్నారు. ఆకుకూరలు, బ్రోకలీ, బ్రస్సెల్స్ మొలకలు విటమిన్ ఖ కి అద్భుతమైన సహజ వనరులని ఎశ్రీవజవశ్రీఖఅఎశ్రీఅఅఎ అధ్యయనం పేర్కొంది. అయితే, సప్లిమెంట్లను కేవలం వైద్యుని పర్యవేక్షణలో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆహార మార్పులతోపాటు, సంబంధిత ఆరోగ్య సమస్యలను గుర్తించి నిపుణులను సంప్రదించడం ద్వారా దీనిని సమర్థవంతంగా నిర్వహించవచ్చని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## అభిషేక్ శర్మ హ్యాట్రిక్ డకౌట్లు- అదొక పాజిటివ్ సంకేతమన్న రవిశాస్త్రి

### భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌పై మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు- అభి మూడు డకౌట్లు అవ్వడం పట్ల ఇతర జట్లు ఆందోళన చెందుతాయని కామెంట్స్




టీ20 ప్రపంచకప్‌లో టీమ్ఇండియా నుంచి ప్రత్యర్థి జట్లకు అతి పెద్ద ముప్పు అభిషేక్ శర్మే అవుతాడని అందరూ భావించారు. అయితే ఈ భారత విధ్వంసకర ఓపెనర్ ఈ టోర్నీ లీగ్ దశలో ఘోరంగా విఫలమయ్యాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవకుండా వికెట్ సమర్పించుకున్నాడు. అయితే అభిషేక్ వరుసగా డకౌట్లు అవ్వడంపై భారత జట్టు మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశాడు. ఇంతకీ శాస్త్రి ఏమన్నాడంటే?

అదొక సానుకూల సంకేతం!

టీ20 వరల్డ్‌కప్ 2026లో సూపర్-8 చేరుకున్న జట్లు భారత స్టార్ ప్లేయర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు డకౌట్లు అవ్వడంపై ఆందోళన చెందుతాయని అభిప్రాయపడ్డాడు. అలాగే అభిషేక్ మూడు డకౌట్లను తాను పాజిటివ్ (సానుకూల) సంకేతంగా పరిగణిస్తానని అన్నారు. ఆదివారం సూపర్-8లో భాగంగా సౌతాఫ్రికాతో టీమ్ఇండియా తలపడనుంది. ఈ హోరాహోరీ మ్యాచ్‌కు ముందు ఐసీసీ రివ్యూలో అభిషేక్ శర్మ ఫామ్‌పై రవిశాస్త్రి ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. "టీ20 టోర్నీ కీలక సమయానికి తన ఉత్తమ ప్రదర్శనను అభిషేక్ శర్మ సేవ్ చేసి ఉండొచ్చు. అభిషేక్ శర్మ వరుసగా మూడు డకౌట్లు అవ్వడాన్ని నేను సానుకూలంగా భావిస్తున్నాను. లీగ్ దశలో అభిషేక్ పరుగులు చేయలేదని కొన్ని జట్లు కొంత ఆందోళన చెందుతాయి. టీమ్ఇండియాకు సానుకూల విషయం ఏమిటంటే లీగ్ దశలో జరిగే ఒక్కో మ్యాచ్‌లో ఎవరో ఒకరు రాణించారు. మొదటి మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ అదరగొట్టాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్, ఇతర బ్యాటర్లు బాగా ఆడారు. తిలక్ వర్మ కూడా తన పాత్రను పోషించాడు. తిలక్ నుంచి అత్యుత్తమ ప్రదర్శన ఇంకా రావాల్సి ఉందని భావిస్తున్నాను" అని రవిశాస్త్రి తెలిపాడు.

'ఏకైక సందిగ్ధత ఇదే'

సూపర్-8లో ఆదివారం తలపడనున్న సౌతాఫ్రికా, టీమ్ఇండియా జట్లు తమ అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ని కలిగి ఉన్నాయని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఆదివారం ఇరు టీమ్‌ల తుది జట్లలో ఎటువంటి మార్పులు ఉండకపోవచ్చని అంచనా వేశాడు. కాగా, గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో ఆడినప్పుడు భారత్ జట్టు రెండు మార్పులు చేసింది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్‌కు ప్లేస్‌లో వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇచ్చింది. అయితే సౌతాఫ్రికా మ్యాచ్ సమయంలో టీమ్ఇండియా ఎదుర్కొనే ఏకైక సందిగ్ధత ప్లేయింగ్ ఎలెవన్‌లో అక్షర్‌ను ఆడించాలా? లేదా సుందర్‌ను ఆడించాలా? అనేదేనని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు. "పిచ్‌పై మంచు పడినప్పుడు టీమ్ఇండియాకు అదనపు బౌలింగ్ ఆప్షన్లు అవసరం. శివమ్ దూబే, హార్దిక్ పాండ్య పూర్తి కోటా ఓవర్లు బౌలింగ్ చేసినా, తిలక్ వర్మ ఒకటి లేదా రెండు ఓవర్లు వేసినా ఇంకా అదనంగా బౌలర్ల అవసరం అవుతుంది. అయితే సౌతాఫ్రికాతో మ్యాచ్ కోసం టీమ్ఇండియా జట్టులో పెద్ద మార్పులు ఉండకపోవచ్చు. నెదర్లాండ్స్‌తో ఆడిన జట్టే బలమైన జట్టు అని నేను భావిస్తున్నాను. సౌతాఫ్రికా టీమ్‌లో చాలా ఆత్మవిశ్వాసం ఉంది. వారు టీమ్ఇండియాకు మంచి పోటీ ఇస్తారు. 2024లో టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇరుజట్లు పోటీ పడ్డాయి. ఇప్పుడు సూపర్-8లో ఇవే జట్లు తలపడుతుండడంతో ఈ మ్యాచ్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని రవిశాస్త్రి పేర్కొన్నాడు. కాగా, టీమ్ఇండియా విధ్వంసర ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ టీ20 వరల్డ్‌కప్ లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌ల్లో తీవ్రంగా నిరాశపర్చాడు. అనారోగ్యం వల్ల నమీబియాతో మ్యాచ్‌లో ఆడలేకపోయిన అతడు, మిగతా మూడు మ్యాచ్‌ల్లోనూ అవసరం లేని దూకుడుతో వికెట్లు పారేసుకున్నాడు. కీలకమైన పాకిస్థాన్ పోరులోనే కాకుండా అమెరికా, నెదర్లాండ్స్ లాంటి చిన్న జట్లపైనా ఖాతా తెరవకుండా పెవిలియన్‌కు చేరుకున్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ సున్నా పరుగులకే వెనుదిరిగాడు. ఆదివారం సఫారీ జట్టులో సూపర్-8 మ్యాచ్‌లోనైనా అభిషేక్ ఫామ్‌లోకి రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. కీలక మ్యాచ్‌లో అభిషేక్ బ్యాట్‌తో విధ్వంసాన్ని సృష్టించాలని ఆశిస్తున్నారు.

## హోమ్ లోన్ పూర్తైనా బ్యాంకులు ఆస్తి పత్రాలు తిరిగి ఇవ్వలేదా - రోజుకు రూ.5వేలు పరిహారం పొందొచ్చు!

### లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు తనఖా పెట్టిన పత్రాలు తిరిగి ఇవ్వాలని ఆర్బీఐ రూల్స్ - లేని పక్షంలో ఫైన్ కట్టాల్సిందే!



సొంతిల్లు అనేది ప్రతీ ఒక్కరి కల. ఈ కలను సాకారం చేసుకునేందుకు ఎంతగానో కష్టపడుతుంటారు. అయితే, సంపాదించిన డబ్బులు సరిపోక చాలా మంది హోమ్ లోన్స్ పై ఆధారపడుతుంటారు. ఈ మేరకు బ్యాంకులు లేదా ఫైనాన్స్ సంస్థల నుంచి కొంత మొత్తాన్ని అప్పుగా తీసుకుని నెలనెలా కొంత డబ్బు చెల్లిస్తుంటారు. అయితే, హోమ్ లోన్ క్లియర్ అయిన తర్వాత కూడా బ్యాంకులు కొన్ని పత్రాలను అందజేయడానికి కాస్త టైమ్ తీసుకుంటాయి. కానీ మీకు తెలుసా రూల్స్ ప్రకారం లోన్ క్లియర్ చేసిన 30 రోజుల్లోపు పత్రాలను కస్టమర్ కు తిరిగి ఇవ్వాలి. అలా ఇవ్వని పక్షంలో బ్యాంక్ పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం. హోమ్ లోన్ తీసుకునే ముందు తాకట్టు కింద బ్యాంకులు కొన్ని పత్రాలను తీసుకుంటాయి. మీరు ఏయే పత్రాలను సమర్పించారో లోన్ మంజూరు సమయంలో బ్యాంకు వాటి వివరాలను మీకు తెలియజేస్తుంది. లోన్ క్లోజ్ చేయగానే అవన్నీ బ్యాంకు నుంచి తీసుకోవాలి. ఏ ఒక్కదాన్నీ బ్యాంకులు లేదా ఫైనాన్స్ కంపెనీలు అట్టిపెట్టుకునే అధికారం లేదు. దీనికి సంబంధించి 2023లో నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది ఆర్బీఐ. టైమ్ లిమిట్ దాటితే పరిహారం : దాని ప్రకారం.. లోన్ పూర్తిగా చెల్లించిన 30 రోజుల తర్వాత కస్టమర్ ఆస్తి పత్రాలను (చర లేదా స్థిరాస్తుల పత్రాలు) తిరిగి ఇవ్వడంలో లేదా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఛాం తొలగింపు ఫారమ్ దాఖలు చేయడంలో ఆలస్యం జరిగితే, ఆ ఆలస్యానికి గల కారణాలను =జు (రెగ్యులేటెడ్ ఎంటిటీ - అంటే బ్యాంక్ లేదా ఫైనాన్స్ సంస్థ) కస్టమర్‌కు తెలియజేయాలి. ఒకవేళ ఆ ఆలస్యం బ్యాంకు నిర్లక్ష్యం వల్ల జరిగితే, ఆలస్యమైన ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున కస్టమర్‌కు పరిహారం చెల్లించాలి. ఉదాహరణకు మీరు జనవరి 20 తేదీన లోన్ క్లియర్ చేశారని అనుకుంటే ఫిబ్రవరి 18వ తేదీలోపు బ్యాంకులు మీ పత్రాలను తిరిగి ఇవ్వాలి. అలా జరగని పక్షంలో ఫిబ్రవరి 19 నుంచి రోజుకు రూ.5వేల చొప్పున జరిమానా వర్తిస్తుంది. ఈ రూల్ డిసెంబర్ 1, 2023 తర్వాత లోన్ క్లోజ్ అయిన అన్ని కేసులకూ వర్తిస్తుంది. ఆస్తి పత్రాలు పోయినా: కేవలం సమయానికి అందించడమే కాకుండా చర, స్థిరాస్తి పత్రాలు పాక్షికంగా లేదా పూర్తిగా పోయినట్లయితే దాని బాధ్యత కూడా బ్యాంకులే చూడాలి. పరిహారం చెల్లించడంతోపాటు డూప్లికేట్ లేదా సర్టిఫైడ్ కాపీలను పొందడానికి అయ్యే మొత్తం ఖర్చును బ్యాంకే భరించాలి. ఈ ప్రక్రియలో కస్టమర్‌కు ఆర్థికంగా ఎటువంటి భారమూ పడకూడదు. డూప్లికేట్ పత్రాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి తెప్పించే మొత్తం ప్రక్రియకు బ్యాంక్ సహకరించాలి. అవసరమైన లీగల్ ఖర్చులను కూడా భరించాలి. అయితే పత్రాలు పోయినట్లు ధ్రువీకరించిన తర్వాత, డూప్లికేట్ పత్రాలు సేకరించడానికి బ్యాంకుకు అదనంగా 30 రోజుల(మొత్తం 60 రోజులు) సమయం లభిస్తుంది. ఈ 30 రోజులు దాటిన తర్వాత కూడా పత్రాలు అందించలేకపోతే, అప్పుడు ప్రతి రోజుకూ ₹5,000 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన హోమ్ లోన్లతో పాటు కార్ లోన్లు, గోల్డ్ లోన్లు సహా అన్ని రకాల సెక్యూర్డ్ పర్సనల్ లోన్లకు వర్తిస్తుంది. కాగా లోన్ క్లియర్ అయిన తర్వాత బ్యాంకులు లేదా రుణ సంస్థలే మీకు డాక్యుమెంట్లు పంపాలని ఆశించొద్దు. మీరే స్వయంగా వెళ్లి తీసుకోవడం మంచిది.

# ఇక కేవలం 15 రోజుల్లోనే సమస్యకు పరిష్కారం.. ఈ బ్యాంకు కొత్త పోర్టల్!



ఈ రోజుల్లో టెక్నాలజీ పెరిగిపోయింది. బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ఏదైనా పని గురించి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. అది కూడా నెలల సమయం పట్టేది. కానీ ఇప్పుడు కొత్త టెక్నాలజీ వచ్చిన తర్వాత ఇంటి నుంచే బ్యాంకింగ్ సేవలు పొందే సదుపాయం వచ్చింది.. ఇంటి యజమాని బ్యాంకు అకౌంట్ ఉండి అందులో డిపాజిట్ చేసినట్లయితే అతని మరణించిన తర్వాత బ్యాంకును సందర్శించడం ఒక కుటుంబానికి చాలా కష్టమైన పని. అయితే ఈ సమస్య ఇప్పుడు తక్కువ సమయంలోనే పరిష్కారం పొందవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) డెత్ క్లెయిమ్ సెటిల్మెంట్ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా రూ.15 లక్షల వరకు క్లెయిమ్‌లు 15 రోజుల్లో పరిష్కారం కానున్నాయి. వినియోగదారులు తమ ఇళ్ల నుండే దరఖాస్తు చేసుకోవచ్చు. పత్రాలను అప్‌లోడ్ చేయవచ్చు. అలాగే స్థితిని ట్రాక్ చేయవచ్చు. ముఖ్యంగా రూ.15 లక్షల వరకు క్లెయిమ్‌లకు థర్డ్ పార్టీ హామీ అవసరం లేదు. క్లిష్ట సమయాల్లో కుటుంబాలకు ఉపశమనం కలిగించడానికి ఈ చొరవ ప్రవేశపెట్టినట్లు బ్యాంకు బ్యాంక్ పేర్కొంది. దీనివల్ల బ్యాంకులకు తరచుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. క్లెయిమ్‌ల ప్రక్రియను సరళీకృతం చేయడం, పారదర్శకంగా చేయడం లక్ష్యంగా ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ చర్య తీసుకుంది.

**ఈ పోర్టల్ రియల్-టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ:**

ఈ పోర్టల్ రియల్-టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను కూడా కలిగి ఉంది. ఇది క్లెయిమ్ వినియోగదారులు ప్రతి దశలోనూ వారి దరఖాస్తుల స్థితిని పర్యవేక్షించడానికి అనుమతిస్తుంది. అర్హత ఉన్న అన్ని క్లెయిమ్‌లను 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని బ్యాంక్ పేర్కొంది. క్లిష్ట సమయాల్లో కుటుంబాలకు ఉపశమనం కలిగించడం, సేవలను డిజిటల్‌గా యాక్సెస్ చేయడం ఈ చొరవ లక్ష్యం అని బ్యాంక్ పేర్కొంది. ఈ చర్య బ్యాంక్ డిజిటల్ పరివర్తన వైపు ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు.

**పత్రాలను ఎలా అప్‌లోడ్ చేయాలి?**

digital.iob.bank.in/deathclaimonline కి వెళ్లండి.

**కొత్త క్లెయిమ్ పై క్లిక్ చేయండి.**

క్లెయిమ్ నామినేషన్‌తో ఉందో లేదో ఎంచుకోండి.

మీ మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, క్యాప్చా కోడ్‌ను నమోదు చేయండి.

మీ దరఖాస్తును సమర్పించిన తర్వాత మీకు ఒక రిఫరెన్స్ నంబర్ అందుతుంది. ఈ నంబర్ క్లెయిమ్‌దారులు తమ క్లెయిమ్ స్థితిని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేయడానికి అనుమతిస్తుంది. మృతుల కుటుంబాలకు బ్యాంకు గణనీయమైన ఉపశమనం కల్పించింది. IOB తన కొత్త కార్పొరేట్ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించింది. ఈ వెబ్‌సైట్ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి ఉంటుంది. అలాగే కస్టమర్లకు సజావుగా, మెరుగైన ఆన్‌లైన్ అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. కుటుంబాలపై భారాన్ని తగ్గించడం, ప్రక్రియను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ చర్య తన డిజిటల్ పరివర్తనలో భాగమని బ్యాంక్ పేర్కొంది.

# మీ బ్యాంకు అకౌంట్‌లో జీరో ఉన్నా రూ.10 వేలు విత్‌డ్రా చేసుకోవచ్చు.. ఎలాగో తెలుసా?



సాధారణంగా బ్యాంకు ఖాతాలో డబ్బులు విత్ డ్రా చేసుకోవాలంటే డబ్బులు ఉండాల్సిందే. కానీ ఈ అకౌంట్లో మాత్రం జీరో ఉన్నప్పటికీ 10 వేల రూపాయల వరకు విత్ డ్రా చేసుకునే సదుపాయం ఉంది. చాలా మందికి ఈ విషయం తెలియకపోవచ్చు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలి పదవీకాలంలో జన్ ధన్ ఖాతాను తెరవడం అత్యంత ప్రజాదరణ పొందిన పథకాలలో ఒకటి. ఈ పథకం కింద ఖాతాదారులకు బీమా కవరేజ్ మాత్రమే కాకుండా ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితి కూడా లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అనేది మీ బ్యాంక్ ఖాతా ఖాళీగా ఉన్నప్పుడు కూడా డబ్బును ఉపసంహరించుకోవడానికి మిమ్మల్ని అనుమతించే ఆర్థిక సౌకర్యం అని గమనించాలి. జన్ ధన్ ఖాతాదారులకు ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితి రూ.10,000గా నిర్ణయించింది. ఈ పథకం గురించి మరింత తెలుసుకుందాం.

**ఖాతా గురించి:**

జన్ ధన్ ఖాతా ఖాతాదారుడి విభిన్న ఆర్థిక అవసరాలను తీర్చడానికి రూపొందించారు. ఇందులో జీరో-బ్యాలెన్స్ ఖాతా, బీమా చేయబడిన రూపే డెబిట్ కార్డ్, ఓవర్‌డ్రాఫ్ట్ ఎంపిక వంటి లక్షణాలు ఉన్నాయి. మెరుగైన ఆర్థిక స్థిరత్వం కోసం ఈ చొరవ లబ్ధిదారులను ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధానిస్తుంది. ఇది దాదాపు 11 సంవత్సరాల క్రితం నరేంద్ర మోడీ మొదటి పదవీకాలంలో ప్రారంభించారు.

**ప్రయోజనాలు ఏమిటి?**

ప్రామాణిక బ్యాంకు ఖాతాను తెరవడానికి అర్హత ఉన్న ఏ భారతీయ పౌరుడైనా బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ ఖాతాను (బీఎస్‌బీడీఏ) కూడా తెరవవచ్చు. ఈ రకమైన ఖాతాకు కనీస బ్యాలెన్స్ అవసరం లేదు. బ్యాంకు శాఖలు, ఏటీఎంలు, బ్యాంకింగ్ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా లావాదేవీలు చేయవచ్చు. ఉపసంహరణలు నెలకు నాలుగుకు పరిమితం.

**బీమా, ఓవర్‌డ్రాఫ్ట్ పరిమితి:**

ఖాతాదారులకు ప్రమాద బీమాతో కూడిన రూపే డెబిట్ కార్డ్ కూడా లభిస్తుంది. అందరు లబ్ధిదారులు రూ.2 లక్షల బీమా కవర్ పొందాలి. అయితే ఆగస్టు 28, 2018 కి ముందు తెరిచిన ఖాతాలకు రూ.1 లక్ష ప్రమాద బీమా కవర్ అందుబాటులో ఉంది. అదనంగా లబ్ధిదారులు రూ.10,000 వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని పొందవచ్చు. సాధారణంగా క్రెడిట్ మొత్తం ఓవర్‌డ్రాఫ్ట్‌పై ఆ మొత్తాన్ని ఉపయోగించిన రోజులకు వడ్డీ వసూలు చేస్తారు. జన్ ధన్ ఖాతాలు ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి ఉంటాయి -- డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై), మైక్రో యూనిట్స్ డెవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ బ్యాంక్ (ముద్ర) పథకం. బడ్జెట్‌కు ముందు సమర్పించిన ఆర్థిక సర్వే మార్చి 2025 వరకు ప్రధాన మంత్రి జన్ ధన్ యోజన కింద 55 కోట్ల 2 లక్షల బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు పేర్కొంది.

# మీ గ్యాస్ సిలిండర్‌పై ఈ నంబర్లు ఉన్నాయా? పేలిపోయే ప్రమాదం.. జాగ్రత్త!



సాధారణంగా ప్రతి ఒక్కరి ఇళ్లల్లో గ్యాస్ సిలిండర్ ఉంటుంది. అయితే ఈ గ్యాస్ సిలిండర్ వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు పదేపదే చెబుతుంటారు. కొన్ని విషయాలను తెలుసుకోకపోతే ప్రమాదంలోపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయంటున్నారు. మీ సిలిండర్ పై ఈ నంబర్లు ఉన్నట్లయితే సిలిండర్ పేలిపోయే ప్రమాదం ఉందంటున్నారు.. సాధారణంగా ప్రతి ఒక్కరి ఇళ్లల్లో గ్యాస్ సిలిండర్ ఉండే ఉంటుంది. ఈ రోజుల్లో కట్టెల పొయ్యిపై వంట చేసుకునే వారి సంఖ్య తగ్గిపోయింది. ప్రతి ఒక్కరు కూడా గ్యాస్ సిలిండర్‌పైనే వంట చేసుకుంటున్నారు. అయితే సిలిండర్ విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అలాగే కొన్ని విషయాలను తప్పకుండా తెలుసుకోవాలి. ముఖ్యంగా సిలిండర్లకు ఉండే గడువు తేదీ ఉంటుందని మీకు తెలుసా గ్యాస్ పైపు విషయంలో కొన్ని సూచనలు పాటించాలని చెబుతున్నారు. ఇంతకీ, గ్యాస్ సిలిండర్ గడువు తేదీ ఎలా గుర్తించాలి పూర్తి వివరాలు తెలుసుకుందాం..

**సిలిండర్ ఎక్స్?పైరీ తేదీని గుర్తించడం ఎలా?**

సాధారణంగా గ్యాస్ వాడేటప్పుడు చాలా మంది సిలిండర్ తీసుకునేటప్పుడు గ్యాస్ లీక్ అవుతుందో లేదో చెక్ చేస్తారు. లేదంటే దాని బరువునూ తనిఖీ చేస్తారు. కానీ, గడువు తేదీని మాత్రం ఎప్పుడూ కూడా చెక్ చేయరు. ఇకపై సిలిండర్ తీసుకునేటప్పుడు గడువు తేదీ కూడా చెక్ చేసి తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. సిలిండర్‌పై అంటే హ్యాండిల్ కింది భాగంలో ఏ, దీ, జ, ఱ అనేవి ఉంటాయి. అనే వాటిల్లో ఏదో ఒక అక్షరం ఉండి పక్కన సంఖ్య కలిగి ఉంటుంది. సిలిండర్ మీద ఉండే ఏదీజఱల అర్థం తెలుసుకుందాం..

**అక్షరం (A, దీ, జ, ఱ): ఇది సంవత్సరాన్ని నాలుగు త్రైమాసికాలుగా విభజిస్తుంది.**

జనవరి నుంచి మార్చి వరకు.

ఏప్రిల్ నుంచి జూన్ వరకు.

జులై నుంచి సెప్టెంబర్ వరకు.

అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు.

ఉదాహరణకు 25 అని ఉంటే: ఇది గడువు ముగిసే సంవత్సరాన్ని సూచిస్తుంది. 25 అంటే 2025. ఈ సంవత్సరం ముగిసిన సిలిండర్ వాడుతున్నట్లయితే వెంటనే గ్యాస్ ఏజన్సీకి సమాచారం అందించండి. లేదా మీరు గ్యాస్ తీసుకునే ముందు ఓ సారి చెక్ చేసుకోండి. ఇలాంటి సంవత్సరం నంబర్ ఉన్నట్లయితే తీసుకోకుండా రిటన్ ఇచ్చేయండి. లేకుంటే అలాగే మీకు తెలియకుండా వాడుతున్నట్లయితే అది పేలిపోయే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు మీరు తీసుకున్న సిలిండర్ మీద "ఏ-27" అని రాసి ఉంటే దాని గడువు తేదీ 2027వ సంవత్సరం జనవరి నుంచి మార్చి మధ్యలో ముగుస్తుందని అర్థం చేసుకోవాలి. అందుకే ఎప్పుడు కూడా గ్యాస్ సిలిండర్ తీసుకునేటప్పుడు వీటిని గమనించడం చాలా ముఖ్యం. లేకుంటే ప్రమాదంలో పడవచ్చంటున్నారు నిపుణులు.

**గ్యాస్ పైపు..**

గ్యాస్ సిలిండర్స్ పేలకుండా ఉండడంలో మనం వాడే పైపులు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. కొంత మంది మార్కెట్లో తక్కువ ధరల్లో వచ్చే గ్యాస్ పైపులను వాడుతుంటారు. అలాంటివి ఎప్పుడు కూడా కొనుగోలు చేయవద్దంటున్నారు నిపుణులు. తక్కువ రేటులో వచ్చే పైపులు నాణ్యత ఉండవని, క్వాలిటీ లేని పైప్స్, రెగ్యులేటర్లనును కొని వాడుతుంటారు. అలాంటి వాటి వల్ల ప్రమాదం పొంచి ఉందంటున్నారు. నాణ్యత లేవిని పైపు, రెగ్యులేటర్ల వల్ల గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. ఎప్పుడు కూడా దీఐఎ హాల్?మార్క్ ఉన్న రెగ్యులేటర్స్, పైపులను మాత్రమే వాడడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

# భారత్-బ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం.. కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందం!



భారతదేశం-బ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం మొదలైంది. భారత్ - బ్రెజిల్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు కొత్త ఊపునిచ్చే కీలక అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మధ్య ద్వైపాక్షిక చర్చలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. భారతదేశం-బ్రెజిల్ సంబంధాలలో కొత్త అధ్యాయం మొదలైంది. భారత్ -- బ్రెజిల్ మధ్య కీలక వాణిజ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు కొత్త ఊపునిచ్చే కీలక అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా మధ్య ద్వైపాక్షిక చర్చలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. అధ్యక్షుడు లూలా, ఆయన ప్రతినిధి బృందాన్ని భారతదేశానికి స్వాగతిస్తూ, ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, "అధ్యక్షులు లూలా, ఆయన బృందాన్ని భారతదేశానికి స్వాగతించడానికి సంతోషిస్తున్నాను. భారత్-బ్రెజిల్ సంబంధాలు చాలా కాలంగా ఆయన దార్శనికత, స్ఫూర్తిదాయక నాయకత్వం ద్వారా ప్రయోజనం పొందాయి" అని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇద్దరు నాయకులు అనేకసార్లు సమావేశమయ్యారు. ప్రతిసారీ బ్రెజిల్ అధ్యక్షులు లూలాకు భారతదేశం పట్ల ఉన్న లోతైన స్నేహం, నమ్మకం స్పష్టంగా అనుభూతి చెందిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అధ్యక్షులు లూలా పర్యటన చారిత్రాత్మక ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు శక్తినిచ్చింది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. లాటిన్ అమెరికాలో భారతదేశానికి బ్రెజిల్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని ప్రధాన మంత్రి మోదీ పేర్కొన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు మించి తీసుకెళ్లడానికి రెండు దేశాలు కట్టుబడి ఉన్నాయి. "మా వాణిజ్యం కేవలం ఒక సంఖ్య కాదు, ఇది పరస్పర విశ్వాసానికి ప్రతిబింబం. అధ్యక్షులు లూలాతో పాటు వచ్చిన పెద్ద వ్యాపార ప్రతినిధి బృందం ఈ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది" అని ప్రధాని మోదీ అన్నారు. సాంకేతికత, ఆవిష్కరణలలో సహకారం భారత్-బ్రెజిల్‌లకు మాత్రమే కాకుండా, మొత్తం దక్షిణాది ప్రపంచానికి ముఖ్యమైనదని ప్రధానమంత్రి మోదీ అన్నారు. AI, డిజిటల్ టెక్నాలజీ, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో భాగస్వామ్యాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు కొత్త దిశానిర్దేశం చేయగలవని ఆయన అన్నారు. అలాగే ఉగ్రవాదానికి వ్యతిరేకంగా రెండు దేశాలు కలిసి పోరాడుతాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# బ్యాంకు లాకర్ నుంచి రూ.60 లక్షల విలువైన ఆభరణాలు మాయం.. ఆర్బీఐ రూల్స్ ఏంటి?



ఇంట్లో ఉన్న బంగారు అభరణాలను దాచుకోవాలంటే బ్యాంకు లాకర్లను వినియోగిస్తుంటారు. ఎందుకంటే లాకర్లలో అభరణాలు భద్రంగా ఉంటాయన్న నమ్మకం అందరిలో ఉంటుంది. కానీ అలాంటి లాకర్ నుంచి 60 లక్షల విలువ చేసే బంగారు అభరణాలు మాయం కావడం సంచలనం రేపింది.. ఎక్కువ భద్రత కోసం ప్రజలు తమ నగలను బ్యాంకు లాకర్లలో ఉంచడానికి తరచుగా భారీ రుసుము చెల్లిస్తారు. చాలా మంది కూడా తమ అభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకుంటారు. కానీ ఆ నగలు లాకర్ నుండే అదృశ్యమైతే ఏమి జరుగుతుంది? దేశ రాజధాని ఢిల్లీలో ఇలాంటి కేసు ఒకటి వెలుగులోకి వచ్చింది. తన బ్యాంకు కీర్తి నగర్ బ్రాంచ్ లాకర్‌లో ఉంచిన రూ.60 లక్షల విలువైన బంగారు నగలు మాయమయ్యాయని ఒక మహిళ పేర్కొంది. PTI నివేదిక ప్రకారం, బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్ తెరిచామని, నగలు కనిపించలేదని ఆ మహిళ చెప్పిందని ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఆ మహిళ బ్యాంకు అధికారులకు సమాచారం అందించి, పోలీసులను కూడా సంప్రదించింది. తన బంగారు నగలు దొంగతనానికి గురయ్యాయని ఆమె ఆరోపించింది. అయితే లాకర్‌లో బలవంతంగా ప్రవేశించిన లేదా ట్యాంపరింగ్ చేసిన ఆనవాళ్లు ఏవీ కనిపించలేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన బృందం సంఘటనా స్థలానికి చేరుకుని లాకర్‌ను పరిశీలించింది.

# రైతులకు గుడ్‌న్యూస్.. పీఎం కిసాన్ 22వ విడత వచ్చేది అప్పుడేనా..?



రైతుల కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు 21వ విడత వరకు డబ్బులు అందగా, ఇప్పుడు 22వ విడత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కేంద్రం ప్రతి ఏడాది.. కేంద్ర ప్రభుత్వ రైతుల కోసం అమలు చేస్న?న్న పథకాల్లో పీఎం కిసాన్ స్కీమ్ ఒకటి. ప్రతి ఏడాది రైతులు ఆర్థిక సాయం అందుకుంటున్నారు. అది కూడా మూడు విడతల్లో 2 వేల రూపాయల చొప్పున మొత్తం ఏడాదికి రూ.6000 అందిస్తోంది కేంద్రం. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 22వ విడత కోసం వేచి ఉండటం మరింత ఎక్కువవుతోంది. జనవరి గడిచిపోయింది. ఇప్పుడు ఫిబ్రవరి నెల కూడా ముగియబోతోంది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు తమ బ్యాంకు ఖాతాల్లో రెండు వేల రూపాయల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. అయితే ఈ 22వ విడతకు సంబంధించిన వాయిదాల విడుదలకు ప్రభుత్వం ఇంకా అధికారిక తేదీని ప్రకటించలేదు. అయితే, మీడియా నివేదికల ప్రకారం 22వ విడత హోలీకి ముందు ఖాతాల్లోకి రావచ్చు.

**హోలీకి ముందు వాయిదా వస్తుందా?**

మీడియా నివేదికల ప్రకారం, ఫిబ్రవరి 24న రైతుల ఖాతాలకు డబ్బును బదిలీ చేయవచ్చు. అయితే ఇది తాత్కాలిక తేదీ మాత్రమే. వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఈ వాదనలను ఇంకా ధృవీకరించలేదు. ఇంతలో కేంద్ర ప్రభుత్వం హోలీ పండుగకు ముందు రైతులకు ఈ బహుమతిని ఇవ్వవచ్చనే బలమైన ఊహాగానాలు కూడా ఉన్నాయి. దృఢమైన ప్రకటన వెలువడే వరకు, ఈ తేదీలను అంచనాలుగా మాత్రమే పరిగణించాలి. అయితే పీఎం కిసాన్ వాయిదా గత చరిత్రను పరిశీలిస్తే.. 19వ విడత నిధులు ఫిబ్రవరి 24న విడుదలయ్యాయి. దానికి ముందు 2024లో 16వ విడత నిధులు ఫిబ్రవరి 28న విడుదల చేసింది కేంద్రం. 2023లో కూడా 13వ విడత నిధుల్ని కేంద్రం ఫిబ్రవరి 27న విడుదల చేసింది. ఈ క్రమంలోనే ఈసారి కూడా 22 వ విడత డబ్బులు.. ఫిబ్రవరిలోనే విడుదలయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఎందుకంటే ప్రతి సారి ఫిబ్రవరిలో ఓ విడత వస్తుంది కాబట్టి 22వ విడత కూడా ఈ నెలలోనే తప్పకుండా వస్తుందని భావిస్తున్నారు.

**డబ్బు దారిలో ఎక్కడైనా ఇరుక్కుపోతుందా?**

ఆర్థిక ప్రయోజనాలను పొందడానికి, అన్ని కాగితపు పనులు పూర్తి చేయడం చాలా ముఖ్యం. చిన్న చిన్న తప్పుల కారణంగా చాలా మంది రైతుల వాయిదాలు ఆలస్యం కావడం తరచుగా కనిపిస్తుంది. పెండింగ్ స్థితి అంటే మీ దరఖాస్తు ప్రక్రియలో లోపం ఉందని అర్థం. ఈ పథకం నుండి ప్రయోజనం పొందాలంటే, మీరు మీ ఆధార్ కార్డును మీ బ్యాంక్ ఖాతాకు లింక్ చేయాలి. అదనంగా, పాన్ కార్డ్ వెరిఫికేషన్, మీ బ్యాంక్ ఖాతాతో ఏవైనా సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి. అలా చేయడంలో విఫలమైతే నిధులను స్వీకరించడంలో గణనీయమైన ఇబ్బందులు తలెత్తవచ్చు.

# బంగారం, వెండి కొనేవారికి బిగ్ షాక్.. రూ.20 వేలు పెరిగిన ధర.. తెలుగురాష్ట్రాల్లో ఎంతంటే..?



భారతీయులకు సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న పసిడి ధరలు అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, చెన్నై నగరాల్లో వెండి ధర ఏకంగా 20 వేల రూపాయలు పెరిగి సామాన్యులకు గట్టి షాక్ ఇచ్చాయి. పెళ్లిళ్ల సీజన్ వేళ పసిడి, వెండి ధరలు ఇలా పోటీ పడి పెరుగుతుండటంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. బంగారం భారతీయుల జీవితాల్లో ఓ భాగం. ఇది కేవలం ఒక మెటల్ కాదు ప్రత్యేక సెంటిమెంట్. పెళ్లి, పండగా ఇలా ఏ వేడుకైనా సరే బంగారం ఉండాల్సిందే. అయితే గత కొంత కాలంగా బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూ సామాన్యులకు గట్టి షాక్ ఇస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో దేశీయంగా బంగారం ధరలు మరోసారి పెరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1910 పెరిగి రూ.159,280గా ఉంది. ఇది నిన్న రూ.1,57,370గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1750 పెరిగి ప్రస్తుతం 1,46,000గా ఉంది. ఈ ధర నిన్న రూ.1,44,250గా ఉంది. అయితే సిల్వర్ ధరలు ఒక్కసారిగా రూ.20వేలు పెరిగి సామాన్యుడికి గట్టి షాకిచ్చాయి. నిన్న కిలో వెండి ధర రూ.2,70,000గా ఉండగా.. ఇవాళ రూ.2,90,000కు పెరిగింది.

**ఢిల్లీ, చెన్నైలో ఇలా**

దేశ రాజధాని ఢిల్లీలోనూ బంగారం ధరలు హైదరాబాద్ కంటే కొంచెం ఎక్కువగానే ఉన్నాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1910 పెరిగి రూ.1,59,430గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,57,520గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం రూ.1750 పెరిగి రూ.1,46,150గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,44,400గా ఉంది. అయితే వెండి ధరలు మాత్రం ఢిల్లీలో తక్కువగా ఉన్నాయి. కిలో వెండి రూ.5000 పెరిగి.. 2,75,000గా ఉంది. ఇక మన పక్క రాష్ట్రం చెన్నైలో బంగారం ధరలు భగభగమంటున్నాయి. 24క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.2840 పెరిగి రూ.1,60,150గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.2600 పెరిగి రూ.1,46,800గా ఉంది.

## బాన్సువాడకు వెళ్తుండగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్...

### పెద్ద శంకరంపేటలో ఉద్రిక్తత...



హైదరాబాద్//ఫిబ్రవరి 22 **ఆకాంక్ష :** హైదరాబాద్ నుండి కామారెడ్డి జిల్లా బాన్సువాడకు నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ను పోలీసులు ఆదివారం మార్గమధ్యంలో అదుపులోకి తీసుకున్నారు. 161 జాతీయ రహదారిపై పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కింగ్స్ 9 రెస్టారెంట్ వద్ద ముందస్తు చర్యగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు.మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టి, ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అదుపులోకి తీసుకొని పెద్ద శంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాన్సువాడలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సమయంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పెద్ద శంకరంపేట, అల్లాదుర్గం, రేగోడు ఎస్ఐలు ప్రవీణ్ రెడ్డి, శంకర్, పోచయ్య తదితరులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే రాజాసింగ్ అరెస్ట్‌ను ఖండిస్తూ భజరంగ్ దళ్ నేతలు పెద్ద శంకరంపేటలో ఆందోళనకు దిగారు. నిరసనగా ఆర్టీసీ బస్సు అద్దాలను పగులగొట్టడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం పెద్ద శంకరంపేటలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై స్పష్టత రాలేదు.

## మూసీ సుందరీకరణ పేరిట రియల్ ఎస్టేట్ దోపిడీ హరీశ్‌రావు ఆగ్రహం...



హైదరాబాద్//ఎఫిబ్రవరి 22 **ఆకాంక్ష :** మూసీ సుందరీకరణ పేరుతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ముఖ్యమంత్రి వేసే ప్రతి అడుగు వెనుక భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే దాగి ఉందని ఆయన విమర్శించారు. పేదల ఇండ్లను కూల్చి, పెద్ద ఎత్తున భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు హరీశ్‌రావు తెలిపారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో కేసీఆర్‌కు మర్చిపోలేని అనుబంధం ఉందన్నారు. కేసీఆర్ మూడు సార్లు ఈ అపార్ట్‌మెంట్‌ను సందర్శించారని, టీఆర్ఎస్ పార్టీ పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడి వార్‌రూమ్‌ల్లో తయారు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ మంచినీటి సమస్య తలెత్తినప్పుడు వెంటనే స్పందించి, హెచ్ఎంపీఎస్ అధికారులను ఆదేశించి ప్రత్యేక పైపులైన్ వేయించారని తెలిపారు. అప్పటి హోంమంత్రి నాయిని నరసింహారెడ్డితో స్వయంగా బటన్ ఆన్ చేయించి ప్రజలకు నీరు అందించారని పేర్కొన్నారు.అదేవిధంగా సబితా ఇంద్రారెడ్డికి ఒక ఫోన్ చేస్తే రాత్రికి రాత్రే అపార్ట్‌మెంట్ ముందున్న రహదారి వేయించారని, అప్పటి మూసీ కార్పొరేషన్ చైర్మన్ సుధీర్ రెడ్డి మూసీ నదిని శుభ్రం చేయించి దోమల సమస్యను తగ్గించారని తెలిపారు. కేసీఆర్ ఎప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంపుపై, ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టారని ఆయన అన్నారు. ఇప్పుడేమో అదే అపార్ట్‌మెంట్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన కేసీఆర్‌కు విరుద్ధంగా, ప్రస్తుత ముఖ్యమంత్రి జేసీబీలతో కూల్చివేయడానికి యత్నిస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. పేదలకు డబ్బులు లేవని చెప్పే ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాల నిర్మాణానికి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.మూసీ సుందరీకరణ పేరుతో జరుగుతున్న చర్యలు పేదల జీవనాధారాలను నాశనం చేస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే ఈ చర్యలను నిలిపివేసి బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## రంగారెడ్డి జిల్లా మధు పార్క్ అపార్ట్‌మెంట్ ఖాళీ నోటీసుపై ఆందోళన..

### బాధితులను పరామర్శించిన హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి....



రంగారెడ్డి//ఫిబ్రవరి 22 **ఆకాంక్ష :** రంగారెడ్డి జిల్లాలోని మధు పార్క్ అపార్ట్‌మెంట్‌ను "గాంధీ సరోవర్" పేరిట ఖాళీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమ నివాసాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డితో పాటు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, మూసీ అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు కారణంగా వేలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని తెలిపారు. మూసీ డెవలప్‌మెంట్ చేసుకోవడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని, అయితే తమ ఇళ్లను కూల్చి వేయడం అన్యాయమని స్పష్టం చేశారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాలో ప్రజల భూములను ప్రభుత్వం గుంజుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. మూసీ ప్రాజెక్టులో గాంధీ విగ్రహం అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజల ఇళ్లను కూల్చడం మానవత్వానికి విరుద్ధమని మండిపడ్డారు. ఒక్క ఇల్లు కూడా తాకకుండా మూసీ అభివృద్ధి చేపట్టాలని, లేదంటే ఈ ప్రభుత్వ అరాచకాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎవరూ అధైర్య పడవద్దని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఇదే విషయంపై ఆమె మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా మూసీ అభివృద్ధి పేరుతో ప్రజల ఇళ్లను కూల్చవద్దని సూచించారని తెలిపారు. మూసీ బాధితుల ఆవేదన చాలా బాధాకరమని, అభివృద్ధి పేరుతో ప్రజల జీవనోపాధిని నాశనం చేయడం సరికాదని హితవు పలికారు.మధు పార్క్ అపార్ట్‌మెంట్ నివాసితులు ప్రభుత్వం తమ సమస్యలను పరిగణలోకి తీసుకుని నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో ప్రాంతంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

## మెదక్ జిల్లాలో ఘనంగా వరల్డ్ థింకింగ్ డే వేడుకలు....



మెదక్//ఫిబ్రవరి 22 **ఆకాంక్ష :** ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలను మెదక్ జిల్లా జనరల్ సెక్రటరీ ఇప్ప రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఒదితీలు తలారి నాగరాజు, బట్టి జోత్స్న సహకరించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, విద్యాసంస్థలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా జనరల్ సెక్రటరీ ఇప్ప రాజేందర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు విద్యార్థుల్లో వ్యక్తిగత క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ శిబిరాలు ప్రారంభించాలని, తరగతులు యథావిధిగా కొనసాగించడంతో పాటు విద్యార్థుల్లో సేవా భావనను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిస్ట్రిక్ట్ రేంజర్స్ కమిషనర్ సృజన మాట్లాడుతూ వరల్డ్ థింకింగ్ డే సందర్భంగా స్కౌట్స్, గైడ్స్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. స్కౌట్స్ మరియు గైడ్స్ విద్యార్థులు నమ్మకమైనవారు, నిజాయితీ గలవారు, ఇతర విద్యార్థులకు సోదర భావంతో ఉండేవారు కావాలని, జంతు ప్రేమికులు, ప్రకృతి ప్రేమికులు, ధైర్యవంతులు, ప్రభుత్వ ఆస్తులకు కాపలాదారులుగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు స్కౌట్స్ సిద్ధాంతాలు, సేవా కార్యక్రమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. స్కౌట్ ఆలోచన, మాట మరియు చేతలలో పవిత్రత ఉండాలని, దైనందిన జీవితంలో పొదుపు అలవాటు చేసుకోవాలని నేతలు సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాయని నిర్వాహకులు తెలిపారు.

## మీలో ఈ లక్షణాలు ఉన్నాయా? హార్ట్ ఫెయిల్యూర్? వార్నింగ్స్ కావొచ్చట!

### శరీరానికి పవర్?హౌజ్?లా గుండె – హార్ట్? ఫెయిల్యూర్?కు ముందు శరీరంలో పలు లక్షణాలు కనిపిస్తాయట – జాగ్రత్తగా ఉంటే మంచిదని సలహా!



మన శరీరం సక్రమంగా పనిచేయడానికి గుండె ఒక పవర్‌హౌస్‌లా పనిచేస్తూ, ఆక్సిజన్, పోషకాలతో కూడిన రక్తాన్ని అన్ని అవయవాలకు పంపిస్తుంది. అయితే, ఏదైనా కారణం వల్ల హార్ట్ ఫెయిల్యూర్ అవుతున్నప్పుడు శరీరం కొన్ని సంకేతాలను పంపుతుందని.. వీటిని ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల హార్ట్ ఎటాక్ లేదా కార్డియోమయోపతి వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో గుండె వైఫల్య సంకేతాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**తల తిరగడం :**

బలహీనమైన గుండె మెదడుకు ఆక్సిజన్?తో కూడిన రక్తాన్ని సరఫరా చేయలేనప్పుడు తల తిరగడం లేదా స్పృహ తప్పిపోయినట్లు అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. దీనిని కేవలం బలహీనతగా భావించి నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు. తరచుగా ఇలా జరిగితే వెంటనే డాక్టర్?ను సంప్రదించాలని సలహా ఇస్తున్నారు.

**నిద్రలో ఇబ్బందులు :**

రాత్రిపూట తరచుగా దగ్గు రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా పదేపదే మూత్ర విసర్జన కోసం నిద్ర లేవాల్సి రావడం గుండె సమస్యకు సంకేతం కావచ్చంటున్నారు నిపుణులు. పడుకున్నప్పుడు శరీరంలోని ద్రవాలు ఊపిరితిత్తుల వైపు వెళ్లతాయని, దీనివల్ల శ్వాస తీసుకోవడం మరింత కష్టమవుతుందని తెలియజేస్తున్నారు.

**ఛాతీలో అసౌకర్యం :**

గుండెలో సూదితో గుచ్చినట్లు అనిపించడం, బిగుతుగా ఉండటం లేదా బరువుగా అనిపించడం వంటివి గుండె సమస్యలకు ప్రధాన సంకేతాలంటున్నారు నిపుణులు. ముఖ్యంగా, శ్రమ పడినప్పుడు ఇలా అనిపిస్తే అది 'ఎంజినా' (గుండెకు రక్త ప్రసరణ తగ్గడం) లేదా హార్ట్ ఎటాక్ ముందస్తు సంకేతం కావచ్చని హెచ్చరిస్తున్నారు.

**శారీరక సామర్థ్యం తగ్గడం :**

మెట్లు ఎక్కినప్పుడు లేదా చిన్న చిన్న ఇంటి పనులు చేసినప్పుడు మునుపటి కంటే త్వరగా అలసిపోతుంటారు. ఇలాంటి వారి గుండె శరీర అవసరాలకు అనుగుణంగా పనిచేయడం లేదంటున్నారు నిపుణులు. వ్యాయామం చేయలేకపోవడం అనేది గుండె పనితీరు తగ్గుతుందనడానికి మొదటి సంకేతమంటున్నారు.

**అకస్మాత్తుగా బరువు పెరగడం :**

చాలా తక్కువ సమయంలో అకస్మాత్తుగా 2-3 కిలోల బరువు పెరిగితే, అది కొవ్వు వల్ల కాకుండా శరీరంలో ద్రవాలు పేరుకుపోవడం వల్ల కావచ్చంటున్నారు నిపుణులు. గుండె రక్తాన్ని సమర్థవంతంగా పంపింగ్ చేయనప్పుడు ఇలా జరుగుతుందని పేర్కొంటున్నారు. నిరంతర దగ్గు లేదా పిల్లికూతలు :లలౌలుపు లేదా గులాబీ రంగు, రక్తంతో కూడిన శ్లేష్మం ఉత్పత్తి చేసే దగ్గు వంటి సంకేతాలు గుండె వైఫల్యానికి కారణమని ాఎవతీఱఝఱ ఎముతీ ాంంశీఎఱఖఱశీ అధ్యయనం పేర్కొంది. కాబట్టి, దీనిని కేవలం ఊపిరితిత్తుల సమస్యగా భావించకూడదని వివరిస్తున్నారు.

**క్రమరహిత హృదయ స్పందన :**

గుండె వేగంగా కొట్టుకోవడం లేదా లయ తప్పడం వంటివి గుండె రక్తాన్ని పంపింగ్ చేయడానికి పడుతున్న ఇబ్బందిని సూచిస్తాయంటున్నారు నిపుణులు. ఇవి అరిథ్మియా వంటి తీవ్రమైన గుండె సమస్యలకు సంకేతాలు కావచ్చని తెలియజేస్తున్నారు. వేగవంతమైన లేదా క్రమరహిత హృదయ స్పందన గుండె వైఫల్యానికి కారణమని అధ్యయనం పేర్కొంది.

**అలసట :**

తగినంత విశ్రాంతి తీసుకున్నప్పటికీ నిరంతరం అలసటగా, బలహీనంగా అనిపిస్తుంటే గుండె తగినంత రక్తాన్ని అవయవాలకు పంపలేకపోతోందని అంటున్నారు నిపుణులు. ఈ సమస్యను చాలా మంది నిర్లక్ష్యంగా తీసుకుంటారని.. కానీ వెంటనే డాక్టర్లను సంప్రదించాలని చెబుతున్నారు.

**కాళ్లు, పాదాల వాపు :**

రక్త ప్రసరణ సరిగ్గా లేనప్పుడు ద్రవాలు కణజాలాలలో పేరుకుపోతాయంటున్నారు నిపుణులు. గుండె బలహీనంగా ఉన్నప్పుడు రక్తం సరిగ్గా ప్రవహించక కాళ్ల కింద భాగాల్లో, ముఖ్యంగా చీలమండల వద్ద వాపు కనిపిస్తుందని చెబుతున్నారు. ఈ పరిస్థితిని పెరిఫెరల్ ఎడెమా అంటారు.

**శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది :**

పడుకున్నప్పుడు ఊపిరి ఆడకపోవడం లేదా నిద్రలో అకస్మాత్తుగా శ్వాస కోసం ఇబ్బంది పడటం గుండె వైఫల్యానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు. దీనిని 'ఆర్థోప్నియా' అంటారు. ఊపిరితిత్తులలో ఒత్తిడి పెరగడం వల్ల ఇలా జరుగుతుందట. ఊపిరితిత్తులలో ద్రవం పేరుకుపోవడం వల్ల దగ్గు, ఊపిరి ఆడకపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుందని అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో ఇలాంటి లక్షణాలు ఏవైనా కనిపిస్తే, వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## చలికాలంలో ఆరోగ్యంగా ఉండాలా?

## ఆహారం విషయంలో ఈ పొరపాట్లు వద్దంటున్న నిపుణులు!

### చలికాలంలో అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యానికి మంచిదని సూచన!



శీతాకాలం ఎండ తక్కువగా రావడంతో సరిపడా 'డి' విటమిన్ శరీరానికి అందదు. తక్కువ ఉష్ణోగ్రత కారణంగా వ్యాయామం చేయడానికి శరీరమూ సహకరించదు. వీటికి తోడు ఆకలి, దాహం ఉండదు. ఇవన్నీ రోగనిరోధకశక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని నిపుణులు అంటున్నారు. ఇవే కాదు, ఈ సీజన్?లో తీసుకొనే ఆహారం విషయంలో తెలిసో తెలియకో చేసే కొన్ని పొరపాట్లు కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని చెబుతున్నారు. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఈ క్రమంలో ఇంతకీ ఏంటా పొరపాట్లు? వాటిని సరిదిద్దుకొనే మార్గాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

**మిగిలిపోయినవి :**

చాలా మంది ఆహారాన్ని వృథ చేయడం ఇష్టం లేక ఉదయం మిగిలినవి రాత్రికి, రాత్రి మిగిలినవి మరుసటి రోజు తింటుంటారు. చలికాలంలోనూ ఇలాగే చేస్తుంటారు. కానీ, ఇది ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే, ఈ సీజన్?లో జీర్ణశక్తి తక్కువగా ఉంటుందని.. ఇలాంటప్పుడు ఒక పూట మిగిలినవి మరో పూట తినడం వల్ల అరుగుదల శక్తి మరింతగా తగ్గిపోతుందని తెలియజేస్తున్నారు. తద్వారా ఆహారం జీర్ణం కాక కడుపుబ్బరం, గ్యాస్ట్రిక్, వికారం, వాంతులు వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అందుకే, చలికాలంలో ఏ పదార్థం తీసుకున్నా వేడివేడిగా తీసుకోవడమే శ్రేయస్కరం అని సూచిస్తున్నారు. చలికాలంలో తినే ఆహారపదార్థాల్లో శక్తి ఎక్కువగా ఉండేవి తీసుకోవాలి. విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్లు తినటం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నట్స్, బాదం పప్పు లాంటివి తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి. వేడివేడిగా ఉన్న ఆహారపదార్థాలు తీసుకోవాలి–డా. అంజలీదేవి, పోషకాహార నిపుణురాలు

**నెయ్యితో :**

మామూలుగానే ఈ సీజన్?లో జీర్ణశక్తి మందగిస్తుంటుంది. ఈ చలికి ఉదయాన్నే నిద్ర లేచి వ్యాయామం కూడా చేయాలనిపించదు. దీంతో బరువు తగ్గే ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని నిపుణులు అంటున్నారు. కాబట్టి, ఇలాంటి సమయంలో నెయ్యిని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మరింత బరువు పెరుగుతామని కొంతమంది భావిస్తుంటారు. కానీ, ఇది నిజం కాదంటున్నారు నిపుణులు. ఎందుకంటే, మంచి కొవ్వులు అధికంగా ఉండే నెయ్యి కడుపు నిండిన భావనను కలిగిస్తుందని చెబుతున్నారు. తద్వారా చిరుతిండ్ల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు. అలాగే, ఇది ఆహారపు కోరికల్ని తగ్గించి శరీరంలో పేరుకుపోయిన కొవ్వుల్ని కరిగించేందుకు సహకరిస్తుందని పేర్కొంటున్నారు. ఈ రెండు ప్రయోజనాలూ బరువు పెరగకుండా నియంత్రణలో ఉంచుకునేందుకు దోహదం చేస్తాయంటున్నారు. అందుకే, ఏ సీజన్ అయినా ఒక స్పూన్ నెయ్యిని తీసుకోవడం ఆరోగ్యకరమని చెబుతున్నారు.

**వాటికి దూరంగా :**

చలికాలంలో వాతావరణం సహజంగానే పొడిగా ఉంటుంది. దీనికి తోడు దాహం వేయట్లేదని కొందరు నీళ్లు సరిగ్గా తాగరు. ఫలితంగా, శరీరం డీహైడ్రేట్ అవడం, చర్మం పొడిబారడం వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. అయితే, ఇలాంటి సమయంలో కొంతమంది అదే పనిగా స్నాక్స్, ప్రిజర్వేటివ్స్ కలిపిన పదార్థాలు వంటివి తీసుకుంటూ ఉంటారని చెబుతున్నారు. వీటిలో కొన్నింటిని నీటి శాతం పూర్తిగా తొలగించి తయారు చేస్తుంటారని తెలియజేస్తున్నారు. ఇలాంటి పొడి పదార్థాలు ఈ కాలంలో తీసుకోవడం వల్ల శరీరం మరింత డీహైడ్రేట్ అవుతుందని పేర్కొంటున్నారు. తద్వారా చర్మం ఎక్కువగా పొడిబారుతుందని హెచ్చరిస్తున్నారు. శీతాకాలంలో తగినంతగా హైడ్రేటెడ్?గా ఉండటం కూడా ముఖ్యమని అధ్యయనం పేర్కొంది. సాధారణంగా మహిళలు రోజుకు సగటున 9 కప్పులు, పురుషులు సగటున 13 కప్పుల నీటిని తాగాలని చీ×ఞ అధ్యయనం పేర్కొంది.

**టీ, కాఫీ మితంగా :**

ఈ చల్లటి వాతావరణంలో వేడివేడిగా కాఫీ లేదా టీ తాగితే ఆ హాయే వేరుగా ఉంటుంది కదూ! అయితే, కొందరు వీటిని అమితంగా తీసుకుంటుంటారు. ఫలితంగా, ఇందులోని కెఫీన్ శరీరాన్ని డీహైడ్రేట్ చేసి నిద్ర సమయాలకు అంతరాయం కలిగిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, ఇది శరీరంలో నీటిని నిలుపుకొనే సామర్థ్యాన్ని తగ్గించి మూత్రవిసర్జనను పెంచుతుందని చెబుతున్నారు. దీనివల్ల కూడా శరీరం డీహైడ్రేట్ అయి అలసట దరిచేరుతుందని తెలియజేస్తున్నారు. కాబట్టి ఈ సమస్యలేవీ ఎదురుకాకుండా జాగ్రత్తపడాలని సూచిస్తున్నారు. అందుకే టీ, కాఫీలు మితంగా తీసుకోవడం లేదా మధ్యమధ్యలో తులసి, అల్లం, దాల్చినచెక్కతో తయారుచేసిన పానీయాలు తాగడం మేలంటున్నారు. వీలైనంత వరకు సాయంత్రం, రాత్రి వేళల్లో కాఫీ లాంటి వాటి జోలికి వెళ్లకపోవడమే ఉత్తమని అధ్యయనంలో తెలిపింది.

**స్వీట్లు లాగిస్తున్నారా?:**

చక్కెరలు అధికంగా ఉండే ఈ పదార్థాలు రోగనిరోధక శక్తిని తగ్గించడంతో పాటు అలసటగా అనిపించేలా చేస్తాయంటున్నారు నిపుణులు. వివిధ వ్యాధులు, ఇన్ఫెక్షన్లతో పోరాడే తెల్లరక్తకణాలను నాశనం చేస్తాయని చెబుతున్నారు. అందుకే చలికాలంలో స్వీట్లు తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అలాగే, ఆయా తీపి పదార్థాల తయారీలో చక్కెరకు బదులుగా బెల్లం, ఖర్జూరాలు, తేనె వంటివి వాడడం మేలని సలహా ఇస్తున్నారు. అలాగే, ఈ జాగ్రత్తలతో పాటు సులభంగా జీర్ణమయ్యే సూప్స్, శరీరంలో వేడి ఉత్పత్తి చేసే మసాలాలు, రోగనిరోధక శక్తిని పెంచే నట్స్ వంటివి తీసుకోవడం ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ కాలంలో ఏవైనా ఆహార పదార్థాలు శరీరానికి సరిపడకపోయినా వాటిని పూర్తిగా పక్కన పెట్టేయడం మంచిదని సూచిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

## హ్యారీ బ్రూక్?ను కొట్టిన క్లబ్ బౌన్సర్– తాగిన మత్తులో గొడవ

### మద్యం మత్తులో నైట్?క్లబ్ బౌన్సర్?తో గొడవ పెట్టుకున్న ఇంగ్లాండ్ కెప్టెన్?– సీరియస్?గా తీసుకున్న బోర్డు మేనేజ్?మెంట్– 30 వేల పౌండ్ల ఫైన్!



ఇంగ్లాండ్ వైట్?బాల్ కెప్టెన్ హ్యారీ బ్రూక్?పై ఓ నైట్?క్లబ్ బౌన్సర్ చేయి చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గతేడాది నవంబర్ 1న న్యూజిలాండ్‌తో మూడో వన్డే మ్యాచ్?కు ముందు రోజు బ్రూక్ మద్యం మత్తులో ఓ నైట్‌క్లబ్ వద్ద గొడవకు దిగాడు. ఈ క్రమంలో సదరు బౌన్సర్ బ్రూక్‌పై బౌన్సర్ చేయి చేసుకున్న. దీన్ని సీరియస్?గా తీసుకున్న ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మేనేజ్?మెంట్ బ్రూక్?కు 30 వేల పౌండ్లు జరిమానా విధించింది.

**ఇదీ జరిగింది**

2025 అక్టోబర్ 31న బ్రూక్ తన సహచర క్రికెటర్లు జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్‌తో కలిసి వెల్లింగ్టన్‌లో ఓ నైట్ క్లబ్‌కు వెళ్లాడు. అయితే ఈ సమయంలో బ్రూక్ మద్యం తాగి ఉన్నాడని అనుమానించిన బౌన్సర్ అతడిని లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే క్లబ్ వద్ద తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వివాదంలో బ్రూక్?పై బౌన్సర్ చేయిచేసుకున్నాడు. అయితే ఈ వివాదంపై ఇంగ్లాండ్ బోర్డు విచారణ చేపట్టింది. దీనిపై బ్రూక్ కూడా బోర్డుకు వివరణ ఇచ్చాడట. తన ప్రవర్తనకుగానూ బ్రూక్ క్షమాపణలు చెప్పాడు. తన చర్యలు తప్పు అని, దానిని అతడు పూర్తిగా అంగీకరిస్తున్నట్లు తెలిపాడు. 'నా చర్యలు తప్పు అని నేను పూర్తిగా అంగీకరిస్తున్నా. నా చర్యలు నాకే కాదు, మా జట్టుకు కూడా ఇబ్బంది కలిగించాయి. ఇంగ్లాండ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అనేది గొప్ప గౌరవం' 'జరిగిన దాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తాను. సహచరు ఆటగాళ్లు, కోచ్‌లు, మద్దతుదారులను నిరాశపరిచినందుకు నేను తీవ్రంగా చింతిస్తున్నా' అని బ్రూక్ ఒక ప్రకటన విడుదల చేశాడు. ఇక బ్రూక్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇంగ్లాండ్ బోర్డు, అతడికి ఫైనల్ వార్నింగ్ ఇచ్చి 30 వేల పౌండ్లు జరిమానాగా విధించింది. ఆసీస్?లో ఫుల్?గా తాగిన ఇంగ్లాండ్ ప్లేయర్లు! ప్రస్తుతం యాషెస్ సిరీస్? కోసం ఇంగ్లాండ్ క్రికెట్ టీమ్ ఆస్ట్రేలియాలో ఉంది. అయితే ఈ సిరీస్?లో రెండు– మూడో టెస్టుకు మధ్య 9 రోజుల విరామం దొరికింది. దీంతో ఈ గ్యాప్?లో ఇంగ్లాండ్ ప్లేయర్లు ఫుల్లుగా మద్యం తాగి ఎంజాయ్ చేసినట్లు వార్తలొచ్చాయి. నోసా బీచ్ రిసార్ట్‌లో మద్యం మత్తులో మునిగితేలారని ఇటీవల కథనాలు వచ్చాయి.

**యాషెస్?లో బ్రూక్**

ఈ యాషెస్?లో బ్రూక్ ఫర్వాలేదనిపించాడు. 10 ఇన్నింగ్స్?ల్లో కలిపి 39.78 యావరేజ్?తో 358 పరుగులు చేశాడు. ఇందులో రెండుసార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. దీంతో ఈ సిరీస్?లో అత్యధిక పరుగుల చేసిన బ్యాటర్ల లిస్ట్?లో మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ ఈ లిస్ట్?లో టాప్?లో ఉన్నాడు. అతడు 10 ఇన్నింగ్స్?ల్లో 62.90 సగటుతో 629 పరుగులు చేయగా, ఇంగ్లాండ్ స్టార్ జో రూట్ 400 రన్స్?తో రెండో స్థానంలో నిలిచాడు.

# ఏడుపాయలలో భక్తుల రద్దీ....

## ఆదివారం సందర్భంగా భారీగా తరలివచ్చిన జనసంద్రం....





మెదక్//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : మెదక్ జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల దుర్గ భవాని దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ వెల్లువెత్తింది. సెలవుదినం కావడంతో ఉమ్మడి మెదక్ జిల్లా సహా వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ప్రభాత వేళ నుంచే భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం ఆలయానికి చేరుకుని అమ్మవారికి ఓడిబియాలు సమర్పించారు. డప్పు చప్పులతో బోనాలు సమర్పిస్తూ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారిని దర్శించుకుంటే పాపాలు తొలగి పుణ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.భారీ రద్దీ కారణంగా ఉచిత సర్వదర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎండోమెంట్ ఈవో వీరేశం ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాపన్నపేట పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించి భక్తులకు సహకరించారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారి దర్శనంతో ఆనందభాష్పాలతో మురిసిపోయారు.

## జై గౌడ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో

# గౌడ కౌన్సిలర్లకు ఘన సన్మానం...



నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జై గౌడ ఉద్యమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో విజయం సాధించిన గౌడ కులానికి చెందిన నూతన కౌన్సిలర్లకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీకి చెందిన గౌడ కౌన్సిలర్లను శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జై గౌడ ఉద్యమ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాతి నారాయణ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు అన్ని రంగాలలో ముందుకు రావాలని, ప్రజాసేవలో విశేష పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకొని, సమర్థవంతంగా పరిష్కరించే బాధ్యత నూతన కౌన్సిలర్లపై ఉందని ఆయన పేర్కొన్నారు.జై గౌడ ఉద్యమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వరకు చేర్చే బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని తెలిపారు. గౌడ సమాజం రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో మరింత బలోపేతం కావాలని, అందుకు నాయకులు సమష్టిగా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ కాటా గౌని సునీత శ్రీనివాస్ గౌడ్, 3వ వార్డు కౌన్సిలర్ వసంత సంతోష్ గౌడ్, 9వ వార్డు కౌన్సిలర్ సుంకరి అలివేల, రాజేష్ గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వారిని నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమ యూత్ అధ్యక్షులు కటగౌని హరీష్ గౌడ్, ప్రసాద్ గౌడ్, సింగారి జ్యోతి గౌడ్, పలుస నిర్మల గౌడ్, గుండ్రాతి సత్యం గౌడ్, కల్పన, సువర్ణ, నిర్మల, యశోద, సుమతమ్మ, విద్య, పుష్ప, శోభ, హేమలత, కవిత, పద్మ, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా, ఘనంగా సాగింది.

## సీతరామ సేవాసమితి మరియు ఆలయ ఫౌండేషన్ చేయూత..



గోదావరిఖని టౌన్,ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : రామగుండం 29వ డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని గున్నాల శ్రీనివాస్ కుమార్తె వివాహానికి శ్రీ సీతారామ సేవాసమితి,ఆలయ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పెళ్లి పట్టుచీర పెట్టీ పెళ్లి కూతురుని చేసి పెళ్లికి కావాల్సిన సామాగ్రిని 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా నిమ్మరాజుల రజిని రవి మాట్లాడుతూ... ఒక పేదింటిలో పుట్టిన అమ్మాయి వివాహానికి తమ వంతు సహాయం అందజేయాలని పెద్ద మనసుతో శ్రీ సీతారామ సేవాసమితి ప్రతినిధులు గోలివాడ చంద్రకళ, సభ్యులు,ఆలయ ఫౌండేషన్ ప్రతినిధి అయితే శివకుమార్ ముందుకు వచ్చి వివాహానికి కావలసిన బోళ్ళు,బియ్యం, ఇతర వస్తువులు అందజేయడం అందులో మమ్మల్ని భాగస్వామ్యం చేయడం చాలా సంతోషంగా ఉందని ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు మరెన్నో చేయాలని శ్రీ సీతారామ సేవా సమితి ప్రతినిధి గోలివాడ చంద్రకళ ని కోరారు.ఈ కార్యక్రమంలో మేడి తిరుపతి,కంది సుజాత,కొండు రమాదేవి,అయిత దేవా,లంక సురేష్,శివ పటేల్,తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మెర బాలిక మృతి ఘటనపై సిపిఎం నేతల పరామర్శ...

నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర గ్రామంలో ఇటీవల పెత్తందారుల దాడికి గురై మృతి చెందిన బాలిక కుటుంబాన్ని పరామర్శించడానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ, జిల్లా కార్యదర్శి పర్వతాలు మరియు రాష్ట్ర నాయకుల బృందం సోమవారం గ్రామానికి రానున్నారు. ఉదయం 8 గంటలకు కుమ్మెర గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘటనపై వివరాలు తెలుసుకోనున్నారు.ఈ విషయాన్ని సిపిఎం మండల కార్యదర్శి పొదిలి రామయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. గ్రామంలో జరిగిన దారుణ ఘటనపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోందని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో సిపిఎం పోరాటం కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. సిపిఎం నాయకుల బృందం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం గ్రామస్తులతో సమావేశమై సంఘటనకు సంబంధించిన పరిస్థితులను తెలుసుకొని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కూడా కోరనున్నట్లు వెల్లడించారు. కుమ్మెర గ్రామంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న నేపథ్యంలో సిపిఎం నాయకుల రాకతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని సిపిఎం నాయకులు స్పష్టం చేస్తున్నారు.

## కుమ్మెర జాతర ఘర్షణ కేసులో ముగ్గురు అరెస్ట్...




నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మెర మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో జరిగిన ఘర్షణ ఘటనలో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.జిల్లా కేంద్రంలోని డిఎస్పి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాలుగు రోజుల క్రితం కుమ్మెర గ్రామంలో జరిగిన జాతర సందర్భంగా దేవస్థాన నిర్వాహకులు మరియు గ్రామానికి చెందిన గణేష్ కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నదన్నారు. ఈ గొడవలో చిన్నారి గాయపడగా, అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందడం సంఘటనను మరింత ఉద్రిక్తంగా మార్చిందని వివరించారు.ఈ ఘటనపై మృతిచెందిన చిన్నారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, కుమ్మెర గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.చిన్నారి మృతి విషయంలో పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని,పోస్టుమార్టం నివేదిక ఆధారంగా అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎస్పి స్పష్టం చేశారు. ఈ కేసులో సంబంధిత ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎటువంటి అలసత్వం ఉండదని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్, తెలకపల్లి ఎస్సై నరేష్, తాడూరు ఎస్సై తదితరులు పాల్గొన్నారు.

# సీఐ ఇంద్రసేనా రెడ్డి, గన్ మెన్ ప్రవీణ్ పై డీజీపీకి ఫిర్యాదు....

## ఘటనపై న్యాయవాదుల వర్గాల్లో ఆగ్రహం, దర్యాప్తు కోసం డిమాండ్...

గోదావరిఖని//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో న్యాయవాదిపై పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మరియు అతని గన్‌మెన్ దాడి చేసారనే ఘటన గత 8ఎనిమిది రోజులుగా వివాదాలకు నిలయంగా మారుతుంది. గోదావరిఖని పట్టణానికి చెందిన న్యాయవాది మార్కపురి తిలక్ ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది. ఈ ఘటన ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం సమయంలో గోదావరిఖని లాల్ బహదూర్ నగర్ ప్రాంతంలో చోటు చేసుకున్నట్లు బాధితుడు పేర్కొన్నారు. బాధితుడి వాంగ్మూలం ప్రకారం, కోర్టు పనులు ముగించుకొని తన ఇంటికి వెళ్తున్న సమయంలో లాల్ బహదూర్ నగర్‌లోని సిపిఐ జెండా స్థంభం వద్దకు చేరుకునేలోగా గోదావరిఖని-I పట్టణ సీఐ ఇంద్రసేన రెడ్డి తన గన్‌మెన్‌తో అక్కడికి చేరుకుని తనను ఆపినట్లు తెలిపారు. తన వద్ద ఉన్న రూ.47,500 మొత్తాన్ని వివాహ వివాదానికి సంబంధించిన కేసులో కోర్టు ముందు పార్టీలకు అప్పగించాల్సిన డబ్బుగా వివరించినప్పటికీ, పోలీసు అధికారి తన వివరణను వినకుండా వ్యవహరించారని ఆరోపించారు.తన సోదరుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేపథ్యంలో


To
THE DIRECTOR GENERAL OF POLICE,
Telangana State.

Respected Sir,

Sub: Requisition to take against the all the concerned culprits who are responsible for inflicting injuries and manhandling on me. The practising advocate at Godavarikhan - reg.

###

With reference to the above cited subject I, Markapuri Thilak, S/o Thirupathi, Age 28 years, Occ: Practising advocate, R/o. Lalbahadur Nagar, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli district would like to submit that on 10-02-2026 during evening hours, after I finished my court work, I was going to my house at Lalbahadur Nagar, while I reached CPI Jhenda (Flag Pole) the Circle Inspector of Police I town Sri Indrasena Reddy along with his gunmen reached there found an amount of Rs.47,500/- (Forty Seven Thousand Five hundred Rupees) in my possession. Though I convinced to him that the amount with mewas pertaining to a matrimonial dispute and the amount was meant to be handedover to the parties before the court at the time final settlement, the CI of police was not in a mood to listen to what I say.

However, if the Police Officer is under the impression that I really retained the amount with me to distribute among the voters of the ward where my brother is contesting the elections, he can follow the legal process whatever is prescribed in this regard. He is at liberty to seize the amount under the cover of a panchanama in presence of two independent witnesses and he can register a FIR against me, if I am able to convince the Returning Officer that such an amount of Rs.47,500 is not meant to be spent among the voters, then the amount can be returned to me if I fail to convince in this regard it will be confiscated by the Government.

But very agonising fact is that, instead of following the legal procedure what the Police Office or the crew of the Electoral process ought to have followed, the CI of Police I town forcibly took my mobile phone into his hands and started answering to the persons from the call log and went on saying that Randi Randiikkada Dabbulu Panchipedthunnam"(Come come all of you,

.... contd..2nd page


:: 2 ::

we are distributing the amount here), in other words, he is trying to create a false evidence against me, when I requested the officer not to such a call to anybody and it is nothing but defaming me in the general public who are present there at LB Nagar CPI Jhedia area, and he deliberately damaged the reputation of me as an advocate by making the calls to my clients over the phone, who for some time under the confusion as to what was really happening over the mobile phone. As this wasgoing on the gunman standing nearby attacked on me inflicting injuries, moreparticularly on my forehead which is isible even now to a naked eye.

Later I was taken to the Municipal Office where the election officer was present and wrote a panchanama there, though I and the advocates whoever gathered there requested to mention in the panchanama as to all these facts, were not at all considered, though a representation was given, it was simply set aside, and case has been registered against me. I am not bothered if the case is registered, I am ready to agitate the matter in the court of law, but the unruly behaviour of the Police Officer and his gunman is totally unfair and objectionable. If a stern action is not initiated against these two persons they will have no respect to any citizen, and there is an imminent danger that the law and order in the hands of these people will be violated. Though I lodged a complaint before the SHO., PS., Godavarikhani-I town at the 12-30 AM (after returning from the municipal office, where the Electoral Crew drafted the panchanama and completed all the formalities), the SHO., PS., Godavarikhani I town did not respond so far, no receipt has been given so far. Being left with no other option, I give this represention to you to take stringent action against all the responsible persons, and to get them punished according to the law.

Thanking you sir,

Date: 21/02/2026

yours sincerely
(MARKAPURI THILAK)
Cell: 8522002161
Advocate
R/o Lalbahadur Nagar, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli District (T.S)

ఓటర్లకు పంచేందుకు ఈ డబ్బు ఉంచుకున్నానని అనుమానం ఉంటే, చట్ట పరమైన ప్రక్రియ ప్రకారం ఇద్దరు సాక్షుల సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకోవచ్చని, అవసరమైతే తనపై కేసు నమోదు చేయవచ్చని తిలక్ తెలిపారు. కానీ అలాంటి చట్టబద్ధమైన విధానాన్ని పాటించకుండా సీఐ తన మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తీసుకుని కాల్ లాగ్‌లోని వ్యక్తులకు స్వయంగా కాల్ చేసి "రండి ఇక్కడ డబ్బులు పంచుతున్నాం" అంటూ తప్పుడు ప్రచారం చేయడం ద్వారా తనపై అపవాదు మోపారని ఆరోపించారు.ఇది మాత్రమే కాకుండా అక్కడే ఉన్న గన్‌మెన్ తనపై దాడి చేసి నుదిటిపై గాయాలు చేశాడని బాధితుడు పేర్కొన్నారు. ఈ సంఘటనను అక్కడున్న ప్రజలు కూడా గమనించారని తెలిపారు. అనంతరం తనను మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి ఎన్నికల అధికారుల సమక్షంలో పంచనామా తయారు చేసినట్లు తెలిపారు. అయితే జరిగిన వాస్తవాలను పంచనామాలో నమోదు చేయాలని తాను మరియు అక్కడకు చేరుకున్న న్యాయ వాదులు కోరినప్పటికీ తమ వాదనలను పట్టించుకోలేదని చెప్పారు.తనపై కేసు నమోదు చేసినా తాను కోర్టులో చట్టపరంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని, కానీ పోలీసు అధికారి మరియు గన్‌మెన్ ప్రవర్తన పూర్తిగా అన్యాయం, చట్ట వ్యతిరేకమని తిలక్ అన్నారు. గోదావరిఖని పట్టణ పోలీస్ స్టేషన్‌లో అర్ధరాత్రి 12:30 గంటలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదని, రసీదు కూడా ఇవ్వలేదని వాపోయారు.ఈ నేపథ్యంలో సంబంధిత సీఐ మరియు గన్‌మెన్‌పై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, చట్ట ప్రకారం శిక్షించాలని డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తిలక్ వెల్లడించారు. ఈ ఘటనపై న్యాయ వాదుల వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పోలీసుల వ్యవహారశైలిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించి దర్యాప్తు చేపడతారా లేదా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.అయితే గోదావరిఖని 1టౌన్ సీఐ ఇంద్ర సేనా రెడ్డిపై రాష్ట్ర డిజిపికి ఈ ఒక్క నెలలోనే రెండు పిర్యాదులు వెళ్లడం ప్రస్తుతం చర్చనీయంశంగా మారుతుంది.

# సీఐ ఇంద్రసేనారెడ్డిపై ఫిర్యాదులు కేవలం కాగితాలకే పరిమితమా...

## ఎన్ని సంఘటనలు జరిగినా సిఐపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారుల విఫలం...

## సీఐపై చర్యలు తీసుకోకుండా న్యాయ వ్యవస్థకు సవాలు విసురుగుతున్న ఉన్నతాధికారులు....

## సీఐపై ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఫిర్యాదు...

గోదావరిఖని//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డిపై వరుస ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు వినతి పత్రాలు, ఫిర్యాదులు అందినా అవి కేవలం కాగితాలకే పరిమితమైపోయాయని స్థానిక న్యాయవాదులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఒక ప్రభుత్వ అధికారి తప్పు చేస్తే సాధారణంగా విచారణ జరిపి చర్యలు తీసుకునే విధానం ఉండగా, గోదావరిఖని టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి విషయంలో మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ పరిణామాల మధ్య తాజాగా దళిత న్యాయవాది మార్కపూరి తిలక్‌పై జరిగిన దాడి ఘటన మరింత సంచలనం రేపింది. ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం కోర్టు పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో సీఐ ఇంద్రసేనారెడ్డి తన గన్‌మెన్‌లతో కలిసి అడ్డగించి దురుసుగా ప్రవర్తించారని బాధితుడు ఆరోపించారు. తన వద్ద ఉన్న



రూ.47,500/- కోర్టు వ్యవహారానికి సంబంధించినదని చెప్పినా వినిపించకుండా తన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, క్లయింట్లతో మాట్లాడి తప్పుడు ప్రచారం చేశారని పేర్కొన్నారు. తాను ప్రశ్నించగా సీఐ అనుచరుల్లో ఒకరు తనపై దాడి చేసి నుదిటిపై గాయాలు కలిగించారని తెలిపారు.అనంతరం మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి పంచనామా నిర్వహించినప్పటికీ దాడి వివరాలను నమోదు చేయలేదని, అక్కడ ఉన్న న్యాయవాదులు కోరినా పట్టించు కోలేదని బాధితుడు ఆరోపించారు. అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ రసీదు ఇవ్వలేదని, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ వ్యవహారం తనపై అధికార దుర్వినియోగం, అవమానం, బెదిరింపు, అలాగే ఎస్సీ, ఎస్టీ చట్టం


To
The Hon'ble Member,
National commission for SC and ST.

Respected Sir,

Sub: Complaint under SC/ST (Prevention of Atrocities) Act, 1989 against CI Indrasena Reddy and his Gunmen for physical assault, humiliation, abuse of authority and illegal acts against a Dalit Advocate – Request for immediate action – Reg.

I, Markapuri Thilak, S/o Tirupathi, Age: 28 years, Advocate, R/o Lalbahadur Nagar, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli District, most respectfully submit as follows:

I belong to Scheduled Caste community and I am a practicing advocate at Godavarikhani.

On 10-02-2026 during evening hours, after completion of my court work, while I was proceeding towards my residence near CPI Jhenda (LB Nagar area), the Circle Inspector of Police, I Town, Godavarikhani, Sri Indrasena Reddy along with his gunmen intercepted me.

They found an amount of Rs.47,500/- in my possession. I clearly explained that the said amount pertains to a matrimonial dispute settlement and was meant to be handed over before the Court. However, without following due process of law, the CI behaved in a high-handed and arbitrary manner.

Instead of conducting proceedings strictly as per law, he forcibly took my mobile phone, answered calls from my clients and deliberately created a false impression in public that I was distributing money to voters. This act was intentionally done to defame me in public and damage my professional reputation as an advocate.

When I questioned such illegal conduct, one of his gunmen physically assaulted me and caused injuries, particularly on my forehead, which were visible and caused severe pain and humiliation.

I was later taken to the Municipal Office where a panchanama was prepared. Despite repeated requests by me and other advocates present to record the true facts including the assault and misconduct, the same were deliberately omitted.

I had lodged a complaint before the SHO, PS Godavarikhani I Town at about 12:30 AM on the same night. However, no receipt was issued and no action has been initiated till date.

కింద అట్రాసిటీగా పరిగణించాల్సిన ఘటనగా పేర్కొన్నారు.ఈ ఘటనపై బాధిత న్యాయవాది మార్కపూరి తిలక్ జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ను ఆశ్రయిస్తూ అధికారికంగా ఫిర్యాదు చేశారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, అతని గన్‌మెన్‌లపై ఎస్సీ,ఎస్టీ చట్టం, 1989 కింద కేసు నమోదు చేసి వెంటనే సస్పెండ్ చేయాలని, నిష్పక్షపాత విచారణ జరిపి తనకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 ప్రకారం తన మౌలిక హక్కులు ఉల్లంఘించబడ్డాయని కూడా ఆయన పేర్కొన్నారు.ఇక సీఐ ఇంద్రసేనారెడ్డిని రక్షించేందుకు కొంతమంది స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, రాజకీయ నాయకులు, అలాగే కొందరు ఉన్నతాధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఒక పోలీస్ అధికారిపై ఇంత తీవ్ర ఆరోపణలు వచ్చినప్పటికీ చర్యలు తీసుకోక పోవడం న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిందని న్యాయవాదుల వర్గాలు పేర్కొంటున్నాయి.ఈ ఘటనపై గోదావరిఖని న్యాయవాదుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సీఐపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది. ప్రస్తుతం ఈ వ్యవహారం పెద్దపల్లి జిల్లాలో చర్చనీయాంశంగా మారి, ఉన్నతాధికారుల వైఖరిపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

# కేజీబీవీలో ఏఎన్ఎమ్ షాహిన్ సుల్తానాకు ఉత్తమ ఉద్యోగ పురస్కారం..

## విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణలో విశేష సేవలకు గౌరవం....

నాగర్ కర్నూల్ టౌన్ //ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏఎన్ఎమ్‌గా విధులు నిర్వహిస్తున్న షాహిన్ సుల్తానాను నాగర్ కర్నూల్ డివిజన్ ఉత్తమ ఏఎన్ఎమ్‌గా ఎంపిక చేసి జిల్లా స్థాయిలో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో, సేవా తపనతో పనిచేస్తూ విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణలో అందిస్తున్న సేవలను గుర్తించి ఆమెకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది.జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి కేజీబీవీ బాలికల ల్యూమినస్ లీగ్ ప్రేరణ కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా అధికారుల సమక్షంలో ఆమెను ఘనంగా సన్మానించారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్, కార్యాలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్, జీసీడీవో శోభారాణి, ఫైనాన్స్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, మండల విద్యాధికారి త్యాగరాజు తదితరులు ఆమెకు ప్రశంసా పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కేజీబీవీలో చదువుతున్న బాలికల ఆరోగ్యాన్ని కాపాడటంలో షాహిన్ సుల్తానా చేస్తున్న కృషి విశేషమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థినుల శారీరక, మానసిక ఆరోగ్యంపై నిరంతరం




పర్యవేక్షణ చేస్తూ, యుక్తవయస్సు బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, రక్తహీనత నివారణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆమె సేవల్లో ప్రధానమైనవిగా గుర్తించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందిస్తూ, తక్షణ వైద్య సహాయం అందించడం ద్వారా బాలికల ఆరోగ్య స్థితి మెరుగుపడేలా కృషి చేస్తున్నారని తెలిపారు.విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో చురుకుదనం పెరుగుతుందని విశ్వసిస్తూ షాహిన్ సుల్తానా ఎల్లప్పుడూ విద్యాలయంలో అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని అధికారులు కొనియాడారు. విద్యార్థినులలో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించడం, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడం ద్వారా కేజీబీవీ విద్యార్థినుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ఆమె చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.షాహిన్ సుల్తానా ఉత్తమ ఏఎన్ఎమ్‌గా ఎంపిక కావడం పట్ల కేజీబీవీ విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమె సేవలు తమకు ఎంతో ప్రేరణగా నిలుస్తాయని, ఆరోగ్య పరిరక్షణలో ఆమె చేస్తున్న కృషి వల్ల చదువులో మరింత పురోగతి సాధిస్తున్నామని విద్యార్థినులు పేర్కొన్నారు. ఈ గుర్తింపు తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా మరింత నిబద్ధతతో పనిచేసి విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉంటానని షాహిన్ సుల్తానా తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేక అధికారి విజయతో పాటు సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యా రంగ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం...ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక

నాగర్‌కర్నూల్//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : తెలంగాణ రాష్ట్ర ఏఐఎస్ఎఫ్ నాలుగో మహాసభలు ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించగా, మహాసభల అనంతరం రాష్ట్ర సమితి సభ్యులుగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధానాలను ఇక సహించబోమని స్పష్టం చేశారు.జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, హాస్టళ్లలో తీవ్రమైన మౌలిక వసతుల కొరత నెలకొని ఉందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి అనుష తెలిపారు. హాస్టళ్లలో సరైన భోజనం, తాగునీరు, భద్రతా సదుపాయాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉండడం వల్ల చదువులు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అధ్యాపకుల కొరత కారణంగా







తరగతులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని, దీనివల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.జాతీయ విద్యా విధానం (బీజూ 2020) అమలు పేరుతో విద్యను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని వారు విమర్శించారు. "విద్య హక్కు అమ్మకపు వస్తువు కాదు" అనే నినాదంతో విద్యార్థి ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో తక్షణం పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యల జాబితాను వెల్లడిస్తూ పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి, ప్రభుత్వ కళాశాలల్లో ఖాళీ అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి, హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, తాగునీరు, భద్రత కల్పించాలి, ఫీజుల పెంపు నిర్ణయాలను రద్దు చేయాలి, కొత్త ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి, రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టేందుకు సిద్ధమని తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు.విద్య కోసం పోరాటం భవిష్యత్తు కోసం సమరం!" అనే నినాదంతో విద్యార్థి ఉద్యమాన్ని మరింత విస్తరించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో నూతన అతిథి గృహాల ఘన ప్రారంభం...

నాగర్ కర్నూల్ టౌన్//ఫిబ్రవరి 22 (ఆకాంక్ష) : నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండల పరిధిలో వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో నిర్మించిన నూతన అతిథి గృహాల ప్రారంభోత్సవం ఆదివారం భక్తి, శ్రద్ధా వాతావరణంలో ఘనంగా జరిగింది. సాయి లక్ష్మి కన్స్ట్రక్షన్స్ అండ్ కో సంస్థ సౌజన్యంతో నిర్మించిన ఈ వసతి గృహాలను సంస్థ నిర్వాహకులు కంటమనేని వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు.దేవస్థానాన్ని దర్శించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ అతిథి గృహాలను నిర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం దేవస్థాన అర్చక బృందం శాస్త్రోక్త పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, అనంతరం అతిథి గృహాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆనందం వ్యక్తం చేశారు.నూతనంగా నిర్మించిన గృహాలు విశాలంగా, శుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దినట్లు, భక్తులకు విశ్రాంతి సదుపాయాలు కల్పించేలా గదులను అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు వెల్లడించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నాయని తెలిపారు. ముఖ్యంగా పండుగల సమయంలో అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు



ఈ వసతి గృహాలు ఉపయుక్తంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.సాయి లక్ష్మి కన్స్ట్రక్షన్స్ అండ్ కో ప్రతినిధులు మాట్లాడుతూ దేవుని సేవలో భాగంగా ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు




తెలిపారు. దేవస్థానం అభివృద్ధికి భవిష్యత్తులో కూడా తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దేవాలయ అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగుతున్నాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా దెంది కృష్ణారెడ్డి సంస్థకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ట్రస్టు సభ్యులు సందడి ప్రతాపరెడ్డి, కృష్ణారెడ్డి, కొత్త చంద్రారెడ్డి, చిన్న కృష్ణారెడ్డి, చిన్న చెన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

## ఆత్మీయ సన్మాన మహోత్సవంలో

## పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణా రావు...



పెద్దపల్లిటౌన్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐతీ. కె.వి.రావు జ్ఞాపకార్థం కామన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం 22వ వార్డు కౌన్సిలర్ ఉప్పు స్వరూపరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ముందుగా వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కౌన్సిలర్ ఉప్పు స్వరూపరాజు ఎమ్మెల్యే విజయరమణా రావును శాలువా కప్పి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. ప్రతి వార్డులో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతాయని, ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నుగ్గిళ్ల మల్లయ్య, వైస్ చైర్మన్ ముస్కాన్ నాజ్ నయ్యర్, కౌన్సిలర్లు శ్రీకాంత్, కొమ్ము సుధాకర్, అమ్రేశ్, కమల్, గుజ్జుల కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మహిళలు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కమాన్‌పూర్‌లో ముత్యాల

## పోచమ్మ దేవాలయం వద్ద బోర్‌వెల్ పనులకు శ్రీకారం..



మంథని//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ దేవాలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ బోర్‌వెల్ పనులను ఘనంగా ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఆయన, దేవాలయానికి వచ్చే భక్తులతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు కూడా శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ సదుపాయం ఉపయోగపడుతుందని తెలిపారు.దేవాలయ పరిసరాల్లో తరచుగా ఎదురయ్యే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ చర్య కీలకమని గ్రామస్థులు అభిప్రాయ పడ్డారు. భక్తుల సౌకర్యార్థం గ్రామ స్థాయిలో తీసుకుంటున్న ఈ చర్యపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ బోర్‌వెల్ ఏర్పాటుకు అయ్యే మొత్తం వ్యయాన్ని దాత మొగిలి రాయలింగు భరిస్తున్నట్లు ప్రకటించారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సేవాభావాన్ని చాటుకున్న ఆయనను గ్రామ ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్, 7వ వార్డు సభ్యుడు పంజా సాయిరాం, సీనియర్ నాయకులు మల్యాల మహేష్ గౌడ్, గుర్రం లక్ష్మి మల్లు, చిప్పకుర్తి అరవింద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాలని వారు ఆకాంక్షించారు.

## గంగాపురి, కూచిరాజ్ పల్లి,

## శ్రీరామ్ నగర్ స్టేజీల వద్ద ప్రతి బస్సు ఆపాలి...

### బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు బోయిని నారాయణ డిమాండ్...



మంథనిరూరల్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ బస్ స్టేజీల వద్ద ప్రతి బస్సును తప్పనిసరిగా ఆపాలని బీజేపీ మాజీ మంథని మండల అధ్యక్షుడు బోయిని నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బోయిని నారాయణ మాట్లాడుతూ, గంగాపురి, కూచిరాజ్ పల్లి, శ్రీరామ్ నగర్ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు దూర ప్రయాణాలకు వెళ్లేటప్పుడు అర్ధరాత్రి వేళల్లో బస్సులు ఈ స్టేజీల వద్ద ఆగకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో స్వగ్రామాలకు చేరుకోవాల్సిన వారు మంథని బస్టాండ్ వరకు వచ్చి బస్సులు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం ఈ మూడు స్టేజీల వద్ద ప్రతి బస్సును ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్ధరాత్రి వేళల్లో కూడా ప్రయాణికులకు సౌకర్యం కల్పించడం అత్యంత అవసరమని, ప్రజా రవాణా వ్యవస్థలో ఇలాంటి సమస్యలు వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. స్థానిక ప్రయాణికులు కూడా ఈ డిమాండ్‌కు మద్దతు తెలుపుతూ బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అమెరికాలో మహాభారతం నాటి త్రీడీ చిత్రం...




మంథని//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** అమెరికాలోని ఫ్లోరిడా నగరంలో ప్రతి సంవత్సరం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే లేక్ వర్క్ బీచ్ స్ట్రీట్ పెయింటింగ్ ఫెస్టివల్ లో ఈసారి దాదాపు 850 మంది ఆర్టిస్టులు పాల్గొన్నారు. అందులో మన దేశం నుంచి కేవలం కృష్ణ మాత్రమే ఎంపిక చేసి ఆహ్వానించారు. 850 లో టాప్50 ఆర్టిస్టులలో కృష్ణ ని కూడా ఎంపిక చేసి, ఫీచర్డ్ ఆర్టిస్ట్ గా గౌరవించారు. 21, 22 తేదీలలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో కృష్ణ మొదటి రోజు మహాభారతంలోని మయసభ లో ప్రస్తావించబడిన మాయాకొలను ను చిత్రీకరించారు. ఈమధ్య ప్రపంచ వ్యాప్తంగా చాలా ప్రసిద్ధి చెందుతున్న ఈ త్రీడి ఆర్ట్ మన మహా భారతంలోనిదేనని, అందుకే ఈ మాయకొలనుని చిత్రీకరించానని కృష్ణ తెలిపారు. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అనే విషయాన్ని తను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ, దేశ గొప్పదనాన్ని విదేశాల్లో చాటడం తనకు గర్వంగా ఉంటుందని తెలిపారు. కృష్ణ వేసిన త్రీడి ఆర్ట్ చూసి, అమెరికా వాళ్ళు చాలా ఆశ్చర్యపోయారు. తనను ఆహ్వానించిన ఈవెంట్ ఆర్గనైజర్స్ సుజానే, షరాన్ లకి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఎష్ట్రప ఖతీఅర్ టతీశీఎ దీష్ఠ్ఘుతీఫ్ష్ఠ,ఎష్ట్రప ాతీ టతీశీఎ మీష్ఠ్ఘుఎష్ఠ్ఘుతీఫ్ అని అమెరికా మీడియా అభిప్రాయపడింది. ఈ మంగళవారం ఫ్లోరిడా లోని కల్చరల్ కౌన్సిల్ లో కృష్ణ త్రీడి చిత్రాలు ప్రదర్శించే అవకాశం ఉంది.

# ముళ్ళ కంచెల్లో మూడుముళ్ల బంధం...

## వివాహేతర సంబంధాలతో రోడ్డున

## పడుతున్న కుటుంబాలు....

## నేర ఘటనలుగా మారుతున్న అక్రమ

## సంబంధాలు...






పెనగొండ సతీష్//తొలి **ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** వివాహేతర సంబంధాలు కుటుంబాలను చిన్నభిన్నం చేసి నాశనం చేస్తున్నాయి. ఎక్కడ చూసినా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం ఆందోళనకర పరిస్థితులకు దారి తీస్తుంది. దీనిపై "ఆకాంక్ష న్యూస్" ప్రత్యేక కథనం...కుటుంబ వ్యవస్థకు మూలాధారం వివాహం. అందుకే పెళ్లంటే నూరేళ్ల పంట అన్నారు. భారతీయ వివాహ బంధానికి ప్రపంచమే తలవంచుతుంది. సంప్రదాయం, ఆచార వ్యవహారాలు, కుటుంబ జీవనంపై ఉన్న గౌరవం, సామాజిక అంశాలు ఇందుకు కారణం. ఒకప్పుడు పాశ్చాత్య సంస్కృతి అంటే ఈసడించుకునే పరిస్థితి పోయి ఇప్పుడు మనం కూడా అదేదారిలో నడిచేందుకు ఇష్టపడుతున్నామన్న భావన క్రమేపీ బలపడుతోంది.పెద్దలు కుదిర్చిన వివాహాలే కాదు.. ఒకరంటే ఒకరు ఇష్టపడి చేసుకున్న ప్రేమ పెళ్లిళ్లు పెటాకులవుతున్నాయి. చిన్నచిన్న విషయాలకే విడాకుల వరకు వెళ్తున్న ఈ తరం దంపతుల పోకడ పాతతరం వారి ఆందోళనకు కారణమవుతోంది. అదే సమయంలో కొందరు పొరుగింటి పుల్లకూర రుచి అన్న చందంగా ఇతరులతో వివాహేతర సంబంధాలు పెట్టుకోవడం కూడా పెళ్లి పెటాకులవడానికి ఓ కారణంగా మారుతోంది. ఈ క్రమంలో తాజాగా కొందరు భర్త ఉండగా, పరాయి వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం. లేదా భార్య ఉండగా భర్త మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం గల కారణాలు రోజు రోజుకు పెరిగిపోతూ ఉండడంతో మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. దీంతో కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయి. అయితే దంపతుల్లో చాలా మందికి ఇతరులతో తమ జీవిత భాగస్వామిని పోల్చి చూసుకునే బలహీనత ఉంటుంది. తాను ఆశించినట్టు భర్త లేడనో, సంసార సుఖం విషయాన్ని పట్టించుకోవడం లేదనో అసంతృప్తికి లోనవుతుంటారు. ఈ అసంతృప్తిలో వివాహేతర సంబంధాల ఉచ్చులో పడుతుంటారు. ఈ విషయం బయటపడ్డాక కాపురాలు కూలుతుండటం ఇటీవల కాలంలో ఎక్కువైంది. వివాహేతర సంబంధాలు విభేదాలకు కారణమై కొన్ని చివరికి నేర సంఘటనలుగా మారుతుండగా మరి కొన్ని విడాకులకు దారితీస్తున్నాయి. ఈ అక్రమ సంబంధాల విషయంలో కొందరు ఎందాకైనా తెగిస్తుండటం, చివరికి కన్నపిల్లల్ని, సొంత కుటుంబీకులనూ బలి చేయడానికి పూనుకోవడం సర్వ సాధారణంగా మారింది.అయితే ఇష్టపడి పెళ్లి చేసుకున్న వారిలోనూ ఈ సమస్య ఉండటం, అదీ పెళ్లయ్యాక గోల్డెన్ పీరియడ్‌గా చెప్పుకునే సంవత్సరంలోపే ఈ సమస్యలు రావడం గమనార్హం. అందంగా సాగుతున్న జీవితం, రత్నాల్లాంటి పిల్లలు, అంతలోనే భార్యభర్తల మధ్య ఉన్నట్లుండి పెద్ద అగాధం. దీనికి కారణం అక్రమ సంబంధం. అక్రమ సంబంధం దాంపత్య సుఖాన్ని పాడు చేస్తుంది. పచ్చని సంసారంలో చిచ్చు పెడుతుంది. భాగస్వాములిద్దరిలో ఏ ఒక్కరి విషయంలో అయినా అక్రమ సంబంధం బయటపడితే, అది తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. ఏ స్త్రీ తన భర్త చేసిన ద్రోహాన్ని సహించదు. అలాగే ఏ పురుషుడు తన భార్య పరాయివాడితో చనువుగా ఉండటాన్ని భరించలేడు. వారితో ఇక కొనసాగడం కష్టంగా ఉంటుంది. మూడుముళ్ల బంధం ముళ్లకంచెలా మనసును గాయపరుస్తుంది. ఇది ఇద్దరు విడిపోయేలా, మరింతగా చెడిపోయేలా, తమ చేజేతులా జీవితం నాశనం చేసుకునే వరకు వెళ్తుంది. కానీ, ఈ కారణం ఏ పాపం తెలియని పిల్లలు అన్యాయానికి గురవుతారు. ప్రస్తుతం సమాజంలో వివాహేతర సంబంధాల ఘటనలుగా చోటు చేసుకుంటున్నాయి. అక్రమ సంబంధాలతో చిన్నభిన్నం అవుతున్న కుటుంబాలు.... సమాజంలో మహిళలు ఎన్నో కట్టుబాట్ల నడుమ పెరుగుతారు. అయిన కూడా సమాజంలో పెరుగుతున్న టెక్నాలజీ, మార్పుల కారణాల వల్లనో లేక వారి సవాసాలు, వారి అలవాట్లలోనో మార్పులు రావడంతో ఇటువంటి పరిస్థితులకు దారి తీసి భార్య, భర్తల మధ్య దురాన్ని పెంచి కుటుంబ బంధం చిన్నభిన్నానికి కారణం అవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే పెళ్లయ్యాక కూడా అక్రమ సంబంధం కలిగి ఉండటానికి కారణాలేమిటి? పలువురు చేసిన సర్వేల్లో ఎన్నో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు.

# నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉద్రిక్తతలు...

## కుమ్మెర ఘటనపై న్యాయం

## కోరుతూ ధరణాలు, రాస్తారోకోలు...





నాగర్‌కర్నూల్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని కుమ్మెర గ్రామంలో పసిపాప మృతి ఘటనపై న్యాయం చేయాలంటూ జిల్లావ్యాప్తంగా ఆగ్రహావేశాలు చెలరేగాయి. సంఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆదివారం వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు భారీ స్థాయిలో ధరణాలు, రాస్తారోకోలు చేపట్టాయి. భూమి కుడి పోలీస్ స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకారులు ప్రభుత్వంపై, పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. అధికార పార్టీకి చెందిన అగ్రవర్ణాల వ్యక్తులు కుమ్మెర గ్రామానికి చెందిన ఒక కుటుంబంపై దాడి చేసి పసిపాప మృతికి కారణమయ్యారని ఆరోపిస్తూ ఇప్పటివరకు వారిపై కేసు నమోదు చేయకపోవడాన్ని వారు తప్పుపట్టారు. పోలీసు వ్యవస్థ నేరస్తులకు కొమ్ముకాస్తూ, బాధితులపై కేసులు నమోదు చేయడం అన్యాయమని మండిపడ్డారు.డీఎస్పీ కార్యాలయంలో అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఎందుకు కేసు నమోదు చేయడం లేదని డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను ప్రశ్నించారు. "ఇది నిర్లక్ష్యం కాదు, పాలనా నేరం. అధికార పార్టీ నాయకుల మాటే చట్టమై బలహీన వర్గాల ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం బాధాకరం" అని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒక దశలో నిరసనకారులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. బాధ్యులను అరెస్టు చేసి కఠిన శిక్షలు విధించే వరకు తమ ఉద్యమం ఆగదని నిరసనకారులు హెచ్చరించారు. దాడికి పాల్పడిన ఎనిమిది మందిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్ చేయాలని డిమాండ్ చేశారు.తదుపరి కుమ్మెర గ్రామానికి వెళ్లిన నాయకులు మృతి చెందిన పాప సమాధి వద్ద నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో జరిగిన దాడి తీరును స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని లేకపోతే బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేయడంతో పాటు గృహ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు.ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి నిందితులపై వెంటనే కేసులు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారగా, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారు.

## లింగాపూర్‌లో పశువైద్యుని నిర్లక్ష్యం

### బర్రె మృతి, రైతుకు లక్ష రూపాయల నష్టం...



గోదావరిఖని//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం లింగాపూర్ గ్రామంలో పశువైద్యుని నిర్లక్ష్యంతో ఒక బర్రె మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనతో గ్రామానికి చెందిన రైతు తిప్పని రాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుటుంబానికి ఆధారమైన పశువు కోల్పోవడంతో దాదాపు లక్ష రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.రైతు తిప్పని రాములు వివరాల ప్రకారం, తనకు చెందిన బర్రె గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా వెంటనే సంబంధిత పశువైద్యునికి సమాచారం అందించినట్లు చెప్పారు. పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ వైద్యుడు స్పందించక పోవడం, కాల్స్ ఎత్తకపోవడం వల్ల చికిత్స ఆలస్యమై చివరకు బర్రె ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. సమయానికి వైద్య సహాయం అందించి ఉంటే తన పశువు ప్రాణాలు కాపాడవచ్చని రైతు వాపోయారు. ఈ ఘటనపై స్పందించిన రైతు నిర్లక్ష్యానికి పాల్పడిన పశువైద్యుడు పల్లె ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు జరిగిన ఆర్థిక నష్టానికి తగిన పరిహారం చెల్లించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని, పశుసంవర్ధక శాఖ అధికారులను కోరారు.గ్రామస్థులు కూడా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పల్లె ప్రసాద్ నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. గ్రామాల్లో పశువైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు



తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే స్పందించే విధంగా వైద్య సేవలను మెరుగు పరచాలని కోరుతున్నారు.ఈ ఘటనపై పశుసంవర్ధక శాఖ అధికారులు విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువైద్య సేవలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ ఘటన స్పష్టంచేస్తోంది.

## హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌లో

## 7వ తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం...



మేడ్చల్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ హాస్టల్‌లో 7వ తరగతి విద్యార్థి శ్రీనాథ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఆదివారం హాస్టల్ గదిలో విద్యార్థి ఎస్. శ్రీనాథ్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించగా, తోటి విద్యార్థులు వెంటనే సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థిని కిందికి దించి ప్రాథమిక చికిత్స అందించి, అత్యవసరంగా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.విద్యార్థి శ్రీనాథ్ సూర్యాపేట జిల్లా ఆత్మకూరు మండలానికి చెందినవాడిగా తెలిసింది. గత సంవత్సరం ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ నుంచి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు బదిలీ అయ్యాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.ఘటన విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో, విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థి చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. హాస్టల్ భద్రత, విద్యార్థుల మానసిక పరిస్థితులపై తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సంఘటనతో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## పెళ్లి పీటల ముందు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్యలతో విషాదం...

రాజస్థాన్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్‌పూర్ జిల్లా మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే విషాద ఘటన చోటుచేసుకుంది. పెళ్లి పీటలు ఎక్కడానికి కొన్ని గంటల ముందే అక్కాచెల్లెళ్లిద్దరూ ఆత్మహత్య చేసుకోవడం కుటుంబ సభ్యులు, గ్రామస్థులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.మృతులైన శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ఒక ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.వీరి పెళ్లిళ్లు శనివారం జరగాల్సి ఉండటంతో అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి సంబరాలు ఘనంగా జరిగాయి. సంప్రదాయ బంధోలి కార్యక్రమం కూడా ఉత్సాహంగా నిర్వహించారు. ఒకే పందిరి కింద ఇద్దరి పెళ్లిళ్లు జరగనున్న నేపథ్యంలో బంధుమిత్రులంతా పెద్ద ఎత్తున చేరుకుని సంబరాల్లో పాల్గొన్నారు.అయితే శనివారం సుమారు 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్యం విష మించడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా,వైద్యులు పరిశీలించి అప్పటికే వారు మృతి చెందినట్లు ప్రకటించారు. దీంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన కుటుంబసభ్యులు మృతదేహాలను ఇంటికి తీసుకువచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా అంత్యక్రియలకు ఏర్పాట్లు ప్రారంభించారు.ఈ విషయం తెలిసిన మృతుల మేనమామ జస్వంత్ సింగ్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అంత్యక్రియలను నిలిపివేశారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మరో ఐదు నిమిషాల ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదికలో పురుగుల మందు సేవించడం వల్లే మరణం సంభవించినట్లు తేలింది. అయితే ఘటనాస్థలంలో ఎలాంటి ఆత్మహత్యా లేఖ లభించలేదు. మృతదేహాలు నీలిరంగులోకి మారినట్లు గుర్తించామని, ఇది విష ప్రభావం వల్లేనని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఈ పెళ్లిళ్ల విషయంలో కుటుంబ పెద్దలు, ముఖ్యంగా బాబాయ్‌లు తీవ్ర ఒత్తిడి తెచ్చారని మృతుల మేనమామ ఆరోపించారు. మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దు చేసి, పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వరులతో బలవంతంగా పెళ్లిళ్లు నిశ్చయించారని, ఆ పెళ్లిళ్లు ఇష్టం లేకపోవడం వల్లే అక్కాచెల్లెళ్లిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నారు. సంఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని ఏడీసీపీ రోషన్ మీనా వెల్లడించారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## జూబ్లీహిల్స్‌లో ఘోర కారు బీభత్సం

### పలువురికి తీవ్ర గాయాలు, భారీ ట్రాఫిక్ స్థంభనం...



హైదరాబాద్//**ఫిబ్రవరి 22 ఆకాంక్ష :** హైదరాబాద్ నగరంలోని ప్రముఖ ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. అతి వేగంతో దూసుకెళ్తున్న ఫెరారీ స్పోర్ట్స్ కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులోకి దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న కార్లు, బైకులను ఢీకొట్టింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడగా పలు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి.ఈ ప్రమాదం జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ నివాసం సమీపంలో చోటు చేసుకుంది. వేగంగా వస్తున్న ఫెరారీ కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను దాటి ఎదురుగా వెళ్తున్న వాహనాలపై ఎగిరి పడింది. దాంతో క్షణాల్లోనే అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన వెంటనే గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. కొందరికి తీవ్ర గాయాలుండగా మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం కారణంగా రోడ్డుపై వాహనాలు అడ్డదిడ్డంగా పడిపోవడంతో రోడ్ నెం.45లో భారీగా ట్రాఫిక్ స్థంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి కేబుల్ బ్రిడ్జి వైపు, అలాగే కేబుల్ బ్రిడ్జి నుంచి రోడ్ నెం.45 వైపు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాహనదారులు ఈ మార్గాలను తప్పించి ప్రత్యామ్నాయ రూట్లలో ప్రయాణించాలని పోలీసులు సూచించారు.ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగుతోంది. నగరంలో అతివేగం ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు వాహనదారులకు హెచ్చరికలు జారీ చేశారు.